జీవించేందుకే మనిషి తినాలి
సమాజ సంక్షేమానికి జీవించాలి
- డాక్టర్ బిఆర్ అంబేద్కర్

REGD NO : APTEL 16144

జన స్వరం

పవర్

అక్షరమే ఆయుధం

www.janaswaram.com

పాఠకులకు విజ్ఞప్తి

జనస్వరం న్యూస్ తెలుగు దినపత్రిక నందు తక్కువ ఖర్చుతో పుట్టినరోజు శుభాకాంక్షలతో పాటు అన్ని కార్యక్రమాలకు ప్రకటనలకు సంప్రదించండి. మా మెయిల్ ఐడీ :
janaswaramnews@gmail.com
మొబైల్ నెంబర్ : 7013030690

సంపుటి : 4 | సంచిక : 241 | ఎడిటర్ : నరేష్ సాకే | తేది : 16-03-2025 | పేజీలు : 5

రెట్టింపుగా పనిచేస్తా.. సహకారం ఇవ్వండి

తణుకు, మార్చి 15 (జనస్వరం) : జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన కొనసాగుతోంది. స్వచ్ఛ్ దివస్ కార్యక్రమంలో భాగంగా తణుకులో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్ద ప్రజలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎంను ప్రజలు పలు ప్రశ్నలు వేశారు. దానికి చంద్రబాబు సమాధానం ఇచ్చారు. '47 ఏళ్ల క్రితం అసెంబ్లీకి వెళ్ళాను. 41 ఏళ్లుగా అసెంబ్లీకి వెళుతున్నాను. పదేళ్లు ప్రతిపక్ష నేతగా పని చేశాను. నా జీవితం అంతా అలుపెరుగని పోరాటం. నా చివరి రక్తపు బొట్టు వరకు మీకు సేవ చేయాలనేదే నా సంకల్పం. ఇప్పటి వరకు ఎంత పనిచేశానో, రాబోయే 5, 10 ఏళ్లలో అంతకంటే రెట్టింపుగా పనిచేస్తాను. మీ సహకారం ఇవ్వండి. రాబోయే 22 ఏళ్లలో మన రాష్ట్రాన్ని దేశంలో నెంబర్ వన్‌గా చేస్తాను' అని చంద్రబాబు తెలిపారు. అలాగే అడిగిన మరికొన్ని ప్రశ్నలకు కూడా సీఎం రిప్లై ఇచ్చారు. ఆరోగ్యశ్రీలో కొన్ని టెస్టులు చేయడం లేదని నందిని అనే మహిళ ప్రశ్నించారు. అలాగే పెన్షన్ కోసం సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా ఇవ్వడం లేదని మరొకరు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ముఖ్యమంత్రి సమాధానమిస్తూ.. 'నేను వచ్చింది మీకు బాధ్యతలు కూడా గుర్తు చేయడానికి. ఇలా ఏ సీఎం అయినా నాలాగా వచ్చారా.. ఎవరికైనా మైక్ ఇచ్చారా.. ఎవరైనా వచ్చినా పరదాలు కట్టుకుని వచ్చారు.. విమానంలో అలా తిరిగి వెళ్ళిపోయేవారు. ఇది ప్రజా ప్రభుత్వం.. సంక్షేమం, అభివృద్ధి రెండు చేయాలనేదే నా అభిమతం. 2004లో టీడీపీని గెలిపించి ఉంటే ఏపీ ఎక్కడికో వెళ్ళిపోయేది. 2019లో నన్ను గెలిపించి ఉంటే, విభజన రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెంది ఉండేది. దానిలో నా తప్పు ఉంది. గుజరాత్‌లో స్థిరమైన ప్రభుత్వం వలన అభివృద్ధి సాధ్యమైంది. స్థిరమైన ప్రభుత్వం ఉంటే అభివృద్ధి స్థిరంగా సాగుతుంది" అని చెప్పుకొచ్చారు. ఏపీలో ఇప్పుడు ఉన్నది ప్రజాప్రభుత్వమన్నారు. వైసీపీకి అధికారం ఇస్తే ఏపీని అంధకారంలోకి నెట్టేశారని మండిపడ్డారు. వేరే వాళ్లు వస్తే ఏదో చేస్తారని ఓట్లేశారన్నారు. ఐదేళ్లలో విపరీతంగా అప్పులు చేసి వెళ్లారని సీఎం వ్యాఖ్యలు చేశారు.

స్వచ్ఛాంధ్ర ఉద్యమం...

మన ఆరోగ్యానికి ఎందుకు ఇబ్బందులు వస్తున్నాయో ఆలోచించాలన్నారు. తిండి, తాగేనీరు, అపరిశుభ్రత వలన వస్తున్నాయని కూడా గమనించాలన్నారు. ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్‌తో 25 లక్షల వరకు ఆర్థిక సహాయం అందజేస్తున్నామని తెలిపారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ రూపొందించామన్నారు. విజన్ రూపొందించడమే కాదని.. తలసరి ఆదాయం పెరిగిందా లేదా అని పరిశీలిస్తున్నామని అన్నారు. వారసత్వంగా 87 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను వదిలిపోయారని... దానిని తీయడానికి నాలుగైదు



నెలలు పడుతుందన్నారు. స్వర్ణాంధ్ర కోసం ఉద్యమం చేస్తూనే, స్వచ్ఛాంధ్ర కోసం ఉద్యమం చేయాలన్నారు. వేస్ట్ ఎనర్జీ కింద కంపోస్టు తయారు చేయడానికి ఒక టెక్నాలజీ వచ్చిందని తెలిపారు. బయో డైవర్సిటీ పేరుతో 10 లక్షలతో మెటీరియల్ పెడితే, కంపోస్టు తయారు చేయవచ్చని చెప్పారు. తణుకు ఎన్టీఆర్ పార్క్‌ను తాను డెవలప్ చేశానని.. కానీ దానిని నాశనం చేశారని ఫైర్ అయ్యారు.

ప్లాస్టిక్ ప్రమాదకరం...

'ఒక బాధ్యత కలిగిన ప్రభుత్వం వచ్చినపుడు, మీరు కూడా బాధ్యతతో వ్యవహరిస్తే, మంచి ఫలితాలు వస్తాయి. ఒకప్పుడు పారిశుధ్య కార్మికులను చులకనగా చూసేవారు. వారు మన ఆరోగ్యాన్ని కాపాడుతున్నారు. వారిపై గౌరవం పెరిగింది.. మునిసిపల్ కార్మికులు అందరిని ఆదుకుంటాం. మీ పరిసరాలు, మీ ఇల్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సమాజం కోసం, స్వర్ణాంధ్ర కోసం స్వచ్ఛందంగా పనిచేయడానికి ముందుకు వచ్చారు..వారిని అభినందించాలి. వారి కోసం ఒక యాప్‌ను రూపొందిస్తాం. ప్లాస్టిక్ చాలా ప్రమాదకరం.. పశువులు వాటిని తిని, చనిపోతున్నాయి. ప్లాస్టిక్ వలన తినే తిండి కూడా విషం అయిపోతున్నది. క్యాన్సర్ వచ్చినప్పుడు బాధ పడుతున్నాం. కానీ క్యాన్సర్ కారణమైన ఆహారం గురించి ఆలోచించాలి. రాష్ట్రంలో క్యాన్సర్ రాకుండా చేయడానికి నోరి దత్తాత్రేయుడుని సలహాదారుగా నియమించాం. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై యుద్ధమే చేయాలి. దానివలన చెడు పరిణామాలు ఉన్నాయి. ప్రమాదకరమైన ప్లాస్టిక్ తయారుచేసే వారిని నియంత్రిదాం' అని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. కాగా.. స్వచ్ఛ దివస్‌లో పాల్గొనేందకు శనివారం ఉదయం తణుకు చేరుకున్న సీఎం చంద్రబాబుకు మంత్రులు, పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. మంత్రి నిమ్మల రామానాయుడు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కె.పట్టాభి రామ్, జిల్లా కలెక్టర్ ఎమ్మెల్యే ఆరుమిల్లి రాధాకృష్ణ, యంయల్ఏలు పులపర్తి రామాంజనేయులు, బొమ్మిడి నాయకర్, బొలిశెట్టి శ్రీనివాస్, పితాని సత్యనారాయణ, మద్దిపాటి వెంకటరాజు, శాసనమండలి మాజీ విప్ అంగర రామ్మోహన్.. సీఎంకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. ఆపై తణుకు జెడ్పీ బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన ప్రజావేదిక వద్దకు చేరుకున్న సీఎం.. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తలికించారు. పర్యావరణాన్ని హితం చేసే డిస్పోజబుల్ వస్తువుల ప్రదర్శనను కూడా తిలకించారు సీఎం. అలాగే ప్రజావేదికపై నుంచి స్వచ్ఛాంధ్రపై విద్యార్థినల గీతాలాపన అందరినీ ఆకట్టుకుంది. అలాగే రాష్ట్రంలో ఉత్తమ పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించిన పలువురిని సీఎం సత్కరించి, మెమెంటోలు బహుకరించారు.

2029 ఎన్నికలు దృష్టిలో ఉంచుకుని పని చేయాలి

ప్రతి టీడీపీ కార్యకర్త 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. తాను ఎక్కడికి వెళ్లినా కార్యకర్తలతో సమావేశం అవుతున్నానని, అలాగే ప్రతి ఎమ్మెల్యే కూడా వారిని కలవాలని ఆదేశించారు. ప.గో.జిల్లా తణుకు నూలి గ్రౌండ్స్‌లో నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమీక్షా సమావేశంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, ఉండి మాజీ ఎమ్మెల్యే రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నో కష్టాలు చూశాం..

ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.." గడిచిన ఐదేళ్లపాటు నాతో సహా టీడీపీ నాయకులు, కార్యకర్తలు అందరూ ఇబ్బందులు పడ్డారు. టీడీపీకి ఒక పటిష్టమైన యంత్రాంగం ఉంది. ఇకపైనా పార్టీ యంత్రాంగం ఎప్పటికప్పుడు మరింత పటిష్టంగా ఉండాలి. ఎన్ని ఒడిదుడుకులు, ఇబ్బందులు వచ్చినా టీడీపీ ఎప్పుడూ అధైర్య పడలేదు. ఎన్ని కష్టాలు ఎదురైనా కార్యకర్తలు ఎప్పుడూ నా వెంటే ఉన్నారు. ఎప్పటికప్పుడు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు నన్ను ఆదరిస్తూనే ఉన్నారు. ఎవ్వరికీ దక్కని గౌరవం టీడీపీకి, నాకూ దక్కింది. అది నా పూర్వ జన్మ పుణ్యం.

అందుకే పొత్తు..

గత ఎన్నికల్లో జనసేనతో పొత్తు పెట్టుకున్నాం. ఆంధ్రప్రదేశ్ బాగుపడుతుందనే బీజేపీతో కలిసి పని చేస్తున్నాం. ఏపీ సర్వనాశనం అయిపోతుందనే కలిసి వెళ్లాలనే నిర్ణయించి ముందుకు వెళ్తున్నాం. ముఖ్యమంత్రిగా ఉండి చాలా కష్టాలు చూస్తున్నా. సీఎం అంటే అనుభవించడం కాదు. ఏపీ సమస్యలు ఎలా పరిష్కరిస్తారని చాలామంది అడిగారు. దానికి ఒకటే మార్గం.. ఒకటి పారిపోవడం లేదా రెండు ఫైట్ చేయటం. నేను ఫైట్‌నే ఎంచుకున్నా. 9 నెలలుగా ఆర్థిక వ్యవస్థ వెసులుబాటు లేదు. గత ప్రభుత్వం వల్ల వ్యవస్థలన్నీ నాశనం అయ్యాయి. వ్యవస్థలు సరిగా పనిచేయడం లేదు. సూపర్ సిక్స్‌లో ఇప్పటికే కొన్ని హామీలు అమలు చేశాం. కేంద్రం నుంచి వచ్చే నిధులను అభివృద్ధితోపాటు మిగిలిన వాటిని సంక్షేమానికి వాడుతున్నాం.

యువరక్తం రావాలి..

టీడీపీ పదవులు ఇచ్చేటప్పుడూ రెండు విషయాలను గుర్తు పెట్టుకుంటుంది. అనుభవం పార్టీకి అవసరం, పరిగెత్తే యువ రక్తం కూడా అవసరం. మొన్న ఎన్నికల్లో ప్రజల ఆమోదం తీసుకుని సీట్లు కేటాయించాం. దేశంలో ఏ రాజకీయ పార్టీ చేయని విధంగా అభ్యర్థులను ఎన్నిక చేశాం. కుటుంబ పెద్ద తప్పుడు నిర్ణయాలు తీసుకుంటే కుటుంబం అంతా నాశనం అవుతుంది. ప్రజల ఆమోదంతోనే ఎవరెవరికి ఏమి చేయాలనేది నిర్ణయిస్తా. ప్రతి క్యాడర్ పార్టీని బలోపేతం చేయడానికి పనిచేయాలి. అలా కాకుండా పార్టీకి ఇబ్బంది కలిగించే ప్రయత్నం చేస్తే ఒకటి రెండుసార్లు చూస్తా. తర్వాత పనిష్మెంట్ గట్టిగా ఉంటుంది. ఎక్కడైనా కార్యకర్తల కాంట్రాక్ట్ బిల్లులు రాజకీయంగా ఆపి ఉంటే చర్య తీసుకునే బాధ్యత మంత్రులు, ఎమ్మెల్యేలదే.

మహిళలు సిద్ధంగా ఉండాలి..

ఈసారి మహానాడు కడపలో పెడుతున్నాం. టీడీపీ పుట్టిన తర్వాత మొదటిసారి కడపలో పెడుతున్నాం. పార్టీని గెలిపించేది, నడిపించేది బలహీన వర్గాలు మాత్రమే. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన ముగ్గురూ బలహీనవర్గాలకు చెందిన బీసీ నేతలే. పార్టీని నమ్ముకున్న టీడీపీ కుటుంబ సభ్యులందరినీ పైకి తీసుకురావడానికి ఏం చేయాలనే దానిపై ఆలోచిస్తున్నా. పార్టీ సభ్యులు ఆఫీసుకి వస్తే సొంత బంధువుల మాదిరిగా అల్పాహారం, విందు ఇచ్చి పంపించే పార్టీ ఒక్క టీడీపీయే. నిన్న కన్నా నేడు ఇంకా బాగా పని చేయడానికి నేను సిద్ధంగా ఉన్నా. అలాగే కార్యకర్తలూ సిద్ధంగా ఉండాలి. మీ మైండ్‌లో ఎప్పుడూ 2029 ఎన్నికలను గుర్తుపెట్టుకోవాలి. మహిళలకు త్వరలో 1/3 రిజర్వేషన్స్ అసెంబ్లీ, పార్లమెంటులో వస్తున్నాయి. ఇవాళ మగవారితో సమానంగా ఆడబిడ్డలూ పోటీపడే అవకాశం వచ్చిందని" చెప్పారు.

అమరావతిలో వైభవంగా శ్రీవేంకటేశ్వర కల్యాణం..

హాజరైన గవర్నర్, సీఎం

తుళ్లూరు, మార్చి 15 (జనస్వరం) : రాజధాని అమరావతిలోని వెంకటపాలెంలో శ్రీవేంకటేశ్వర కల్యాణ మహోత్సవం వైభవంగా కొనసాగుతోంది. వైకుంఠవాసుడి కల్యాణం కోసం నవ్యనగరి అమరావతి ఆధ్యాత్మిక సొబగులద్దుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఆలయ ప్రాంగణం వద్ద తిరుమల ఆలయ నమూనా గోపురాలతో విశాలమైన వేదిక ఏర్పాటు చేశారు. విద్యుత్తు దీపాలు, పుష్పాలు, పచ్చటి తోరణాలు, దశావతారాల కటౌట్లతో ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. రాజధాని పరిధిలోని 24 గ్రామాల్లో ప్రతి ఇంటికీ ఆహ్వాన పత్రికను అందజేసి.. స్వామివారి కల్యాణానికి ఆహ్వానించారు. ఆయా గ్రామాల నుంచి వచ్చే వారి కోసం అధికారులు 300 బస్సులు కూడా ఏర్పాటు చేశారు.

హాజరైన గవర్నర్, సీఎం

కల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, గవర్నర్



జస్టిస్ అబ్దుల్ నజీర్, న్యాయమూర్తులు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తితిదే బోర్డు సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు

హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారికి చంద్రబాబు దంపతులు పట్టు వస్త్రాలు సమర్పించారు.

బహు భాషా విధానంపై నా వైఖరి మారలేదు: పవన్ కల్యాణ్

అమరావతి, మార్చి 15 (జనస్వరం) : ఒక భాషను బలవంతంగా రుద్దడం లేదా ఒక భాషను వ్యతిరేకించడం సరి కాదని జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. భారతదేశ జాతీయ, సాంస్కృతిక ఏకీకరణ లక్ష్యాన్ని సాధించడంలో ఈ రెండు అంశాలు దోహదపడవన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. "నేను ఎప్పుడూ హిందీని ఒక భాషగా వ్యతిరేకించలేదు. దానిని తప్పనిసరి చేయడాన్ని మాత్రమే వ్యతిరేకించాను. ఎన్ఈపీ-2020 స్వయంగా హిందీని అమలు చేయలేదు. హిందీ భాష అమలు విషయంలో తప్పుడు కథనాలను వ్యాప్తి చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు. ఎన్ఈపీ-2020 ప్రకారం విద్యార్థులు విదేశీ భాషతో పాటు ఏవైనా రెండు భారతీయ భాషలు (మాతృ భాషతో పాటుగా) నేర్చుకునే వెసులుబాటు ఉంటుంది. హిందీ వద్దనుకుంటే వారి మాతృ భాషతో పాటు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ... ఇలా ఏదైనా ఇతర భారతీయ భాషను ఎంచుకోవచ్చు. విద్యార్థులకు ఎంపిక చేసుకునే సాధికారత కల్పించడం ద్వారా జాతీయ ఐక్యతను ప్రోత్సహించడం, భారతదేశ గొప్ప భాషా వైవిధ్యాన్ని కాపాడటం కోసం బహుభాషా విధానాన్ని రూపొందించారు. దీన్ని రాజకీయ అజెండా కోసం తప్పుగా అర్థం చేసుకోకూడదు. బహు భాషా విధానంపై పవన్ కల్యాణ్ తన వైఖరిని మార్చుకున్నారని చెప్పడం పూర్తిగా అవగాహనా రాహిత్యమే అవుతుంది. ప్రతి భారతీయుడికి భాషా స్వేచ్ఛ, విద్యను ఎంపిక చేసుకొనే స్వేచ్ఛ ఉండాలన్న విషయంలో జనసేన పార్టీ కట్టుబడి ఉంది.

జీవితం - ఏ "చ్రితం"



ఈ రోజు పంచాంగం వేళలు

తేదీ : 16 మార్చి 2025,
తిథి : బహుళ విదియ (సా.05:01 వ.కు),
నక్షత్రం : హస్త (ఉ.11:46 వ.కు)
బ్రహ్మ ముహూర్తం : తె.04:32ల తె.05:20
రాహుకాలం : సా.04:34ల సా.06:04,
యమగండం : మ.12:06ల మ.01:35,
వర్జ్యకాలం : రా.08:46, రా.10:47

ఈ రోజు నమాజ్ వేళలు

తేదీ : 16 మార్చి 2025
ఫజర్ : తెల్లవారుజామున గం. 05:16
సూర్యోదయం : ఉదయం గం. 06:26
జొహర్ : మధ్యాహ్నం గం. 12:29
అసర్ : సాయంత్రం గం. 03:49
మఘ్రిబ్ : సాయంత్రం గం. 06:30
ఇష : రాత్రి గం. 07:42

జన స్వరం విలేకరులు కావలెను

"జనస్వరం" ఈ-దినపత్రిక (వెబ్ పత్రిక) నందు పని చేయుటకు రెండు తెలుగు రాష్ట్రాల్లో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విలేకరులు కావలెను.. అసక్తి ఉన్న వారు సంప్రదించండి..

సాయి కల్యాణ్
ఫోన్ నెం : 7013030690
మేనేజింగ్ డైరెక్టర్, జనస్వరం మీడియా

జాతీయ రాజకీయాల్లోకి పవన్ కళ్యాణ్?

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అతి త్వరలోనే జాతీయ రాజకీయాల్లోకి వెళ్లే అవకాశం ఉందని అర్థమవుతుంది. తాజాగా శుక్రవారం జరిగిన జన సేన ఆవిర్భావ సభలో ఆయన చేసిన వ్యాఖ్యలు గమనిస్తే అలాగే అనిపి స్తుంది. ముఖ్యంగా డీలిమిటేషన్, త్రిభాషా విధానం, పాకిస్థాన్, బంగ్లాదేశ్ లో హిందువులపై జరుగుతున్న దాడులు, గోద్రా మారణహోమం వంటి అంశాలపై పవన్ స్పష్టమైన అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ అంశాల ను ప్రస్తావించడం ద్వారా ఆయన కేవలం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీ యాలకే పరిమితం కాకుండా దేశ స్థాయిలో తన పాలిటికల్ స్ట్రాటజీని విస్తరించేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఇటీవల మహా రాష్ట్ర, హరియాణా రాష్ట్రాలకు పవన్ కళ్యాణ్ వెళ్లినప్పుడు, ఆయనకు అక్కడ ఘన స్వాగతం లభించింది. ఈ స్టేట్స్లో ఆయనకు మంచి గుర్తింపు ఉండటమే కాకుండా, అక్కడి ప్రజలు, నాయకులు కూడా జనసేన నాయ కుడిపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఇది జనసేన పార్టీకి జాతీయ స్థాయిలో విస్తరణకు మార్గాన్ని సుగమం చేయొచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తు న్నారు. జనసేనను ఇప్పటివరకు ఆంధ్ర, తెలంగాణకు మాత్రమే పరిమితం చేసినా, పవన్ దేశవ్యాప్తంగా ప్రజల మన్ననలు పొందే విధంగా తన పార్టీని అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కనిపిస్తోంది. జనసేన అధ్య క్షుడిగా పవన్ కళ్యాణ్, భవిష్యత్లో జాతీయ స్థాయిలో తన పాత్రను మరి ంత విస్తరించేందుకు చర్యలు తీసుకోవచ్చు అని నాదెండ్ల మనోహర్ సైతం వ్యాఖ్యానించడం గమనార్హం. ఇది పార్టీ అంతర్గతంగా కూడా జాతీయ స్థాయిలో విస్తరణకు ఉత్సాహం పెరుగుతోందని సూచిస్తోంది. అయితే జాతీయ రాజకీయాల్లో జనసేనకి ఎంతవరకు స్థానం లభిస్తుందో చూడాలి.

ఎడిటోరియల్

జమ్ము సాయి కల్యాణ్,
పొలిటికల్ అనలిస్టు,
మేనేజింగ్ డైరెక్టర్,
జనస్వరం మీడియా.

ఆరేళ్లుగా న్యాయం కోసం పోరాడుతున్నా..

- ఇంతవరకు కేసులో పురోగతి లేదు
- ఈ పోరాటం ఇలాగే కొనసాగిస్తా
- నిందితుల కంటే ఎక్కువ శిక్ష తామే అనుభవించాం
- సీబీఐ మళ్లీ విచారిస్తుందని ఆశిస్తున్నా
- కోర్టును కూడా ప్రాధేయ పడుతున్నా
- డాక్టర్ సునీత రెడ్డి

పులివెందుల, మార్చి 15 (జనస్వరం) : తమ తండ్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో న్యాయం కోసం ఆ రేళ్లుగా పోరాడుతున్నా.. కానీ ఇంతవరకు కేసులో పురోగతి లేదు.. ఇంతటితో ఈ పోరా టం ఆగదు.. ఇలాగే కొనసాగిస్తా.. నిందితుల కంటే ఎక్కువ శిక్ష తామే అనుభవిం చాం.. సీబీఐ మళ్లీ విచారిస్తుందని ఆశిస్తున్నా.. అలాగే కోర్టును కూడా ప్రాధేయపడుతున్నా అని మాజీ మంత్రి వివేకా కుమార్తె డాక్టర్ సునీతా రెడ్డి పునరుద్ఘాటించారు. తండ్రి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని వైఎస్ రాజారెడ్డి ఘాట్ వద్ద శనివారం ఆమె భర్త రాజశేఖర్ రెడ్డితో కలిసి నివా ళులర్పించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ హత్య జరిగి ఆరు సంవత్సరాలవుతున్నా నిందితులం దరూ బయటే తిరుగుతున్నారన్నారు. వైఎస్ వివేకానంద రెడ్డి హత్య జరిగితే ఇంతవరకు న్యాయం జరగలేదన్నారు. మరి ఎవరికో న్యాయం జరుగుతుందని ఎలా అర్థం చేసుకోవాలన్నారు. న్యాయపో రాటమైతే కచ్చితంగా చేస్తామన్నారు. ఈ కేసులో నిందితు ల కన్నా తామే ఎక్కువ శిక్ష అనుభవిస్తున్నామన్నారు. ఈ కేసులో కచ్చితంగా న్యాయం జరుగుతుం దన్న నమ్మకం ఉందన్నారు. సీబీఐ వాళ్ళు మళ్లీ ఇన్వెస్టిగేషన్ మొదలు పెడతారని ఒక నమ్మకం ఉం దన్నారు. ఈ కేసులో ఉన్న సాక్షులందరూ చనిపోతున్నారని, సాక్షులందరి హెల్త్ గురించి సెక్యూరిటీ అంతా చూసుకోవాలన్నారు. సాక్షుల మీద చాలా ప్రెషర్ పెడుతున్నారని ఇలాంటివి జరగకూడద న్నారు. సాక్షులు అనుమానంతో చనిపోతు న్నారని ఇలాంటివన్నీ ఆగాలని ఆమె కోరారు.

ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాలలో స్వచ్ఛ- ఆంధ్ర

పులివెందుల, మార్చి 15 (జనస్వరం) : స్థానిక ఆహార విజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో "స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమంలో భాగంగా "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నివారణ–పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం" అనే అంశంపై శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్. జయమ్మ, డాక్టర్. నివేదిత మాట్లా డుతూ ప్రతినెల మూడవ శనివారం ఈ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు కళాశాల ప్రధాన భవనం వెనుక భాగంలో ఉన్న ప్లాస్టిక్, ఇతర వ్యర్థ పదార్థాలను తొలగించి చెత్త కుండీలలో వేశారు. ఈ సందర్భం గా కళాశాల ఇంచార్జ్ అసోసియేట్ డీన్ అరుణ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లను అభి నందించారు. పిడి డాక్టర్ రాజశేఖర్, కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థి వాలంటీర్లు పాల్గొన్నారు.

ప్రయాణికుల ఉపశమనం కోసమే బస్సు షెల్టర్ల ఏర్పాటు

ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి



పులివెందుల, మార్చి 15 (జనస్వరం) : ప్రయాణికుల ఉపశమనం కోసమే బస్సు షెల్టర్లు ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. కడప – పులివెందుల జిల్లా ప్రధాన రహదారిలో వైద్య కళాశాల ఎదురుగా సుమారు 19 లక్షల వ్యయంతో ఏర్పాటుచేసిన బస్సు షెల్టర్ల ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సర్వ వైద్య శాలకు ప్రతిరోజు అనేకమంది రోగులు వారితో పాటు ప్రజలు వెళ్తుంటారని తెలిపారు. ఇదే అక్కడ బస్సు స్టాప్ లేని కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారన్నారు. కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత ఇప్పుడు అక్కడ బస్సుల రాకపోకల కోసం నిరీక్షించాల్సిన అవసరం లేద న్నారు. ఎండ వాన గాలి వంటి వాటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోడ్డుకు ఇరువైపులా షెల్టర్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ షెల్టర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాగిరెడ్డి ప్రభాకరరావు కుటుంబ సభ్యులకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ



యలమంచిలి/రాంబిల్లి, మార్చి 15 (జనస్వరం) : రాంబిల్లి మండలంలోని ఈ నెల 4న స్వర్గస్థులైనా ధిమిలి మాజీ సర్పంచ్ నాగిరెడ్డి ప్రభాకరరావు పెద్దకర్మ కార్యక్రమం సందర్భంగా యలమంచిలి నియోజకవర్గం మాజీ యు.వి రమణమూర్తి రాజు (కన్నబాబు), అనకాపల్లి జిల్లా పార్లమెంట్ నియో జకవర్గ ఇంచార్జ్, చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం దర్మశ్రి పాల్గొని ప్రభాకరరావు కుటుంబ సభ్యు లను పరామర్శించారు. వారితో పాటు అచ్చుతాపురం మండలం పార్టీ ప్రెసిడెంట్, దుప్పుతురు సర్ప ంచ్ దేశం శెట్టి శంకర్రావు, రాంబిల్లి మండలం పార్టీ ప్రెసిడెంట్ పిన్నమరాజు కిషోర్ రాజు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కబళిస్తున్న ప్లాస్టిక్ భూతం

- ప్లాస్టిక్ వ్యర్థాలతో పెను ప్రమాదంలో పర్యావరణం
- విపరీతమైన ప్లాస్టిక్ వాడకంతో విషతుల్యమవుతున్న గాలి, నీరు, నేల
- రోడ్లపై విసిరిన పాలిథిన్ కవర్లు తిని మృత్యువాత పడుతున్న మూగజీవాలు
- ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించకపోతే భావితరాల వారి ఆరోగ్యం ప్రశ్నార్థకమే
- ప్రజావగాహన పెంపుతోనే ప్లాస్టిక్ నియంత్రనపై మెరుగైన ఫలితాలు
- మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ల పిలుపునందుకొని పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలి
- సచివాలయం సిబ్బంది, కూటమి నేతలతో కలిసి స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ళ హరి



గుంటూరు, మార్చి 15 (జనస్వరం) : మనిషి జీవితంలోకి పెను భూతంలా దూసుకొచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు పర్యావరణంతో పాటూ ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని జిల్లా జనసేన అధి కార ప్రతినిధి ఆళ్ళ హరి ఆందోళన వ్యక్తం చేశారు. కంటికి కని పించని సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు మనిషి ఆరోగ్యాన్ని కబళిస్తున్నా యని ఆవేదన చెందారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా గుంటూరు నగరాన్ని ప్లాస్టిక్ భూతం నుంచి విముక్తి చేద్దాం అం టూ సచివాలయం సిబ్బందితో పాటూ కూటమి నేతలతో కలిసి అయన శనివారం శ్రీనివాసరావుతోటలో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నియంత్రణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. ప్రజల్లోనూ, వ్యాపారస్థుల్లోనూ ప్లాస్టిక్ వినియోగ దుష్పరిణామాల పై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఆళ్ళ హరి మాట్లా డుతూ హెూటళ్ళలో వేడివేడి పదార్థాలను ప్లేటు కవరుపై వేసి అందిస్తుంటారని దీంతో కడుపులోకి సూక్ష్మ ప్లాస్టిక్లు చేరి కణా లను దెబ్బ తీయటమే కాక క్యాన్సర్కి కూడా కారణమవుతున్నాయ న్నారు. తిను బండారాలు మొదలుకొని కూరగాయలు, నిత్యావసర సరుకులు వంటి ప్రతీ చిన్న దానికి ప్లాస్టిక్ కవర్లు వాడటంతో ఎక్క డికక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. విపరీ తమైన ప్లాస్టిక్ వినియోగంతో గాలి, నీరు, నేల సైతం విషతుల్య మవుతున్నాయన్నారు. రోడ్లపై ఇష్టానురీతిలో ఎక్కడపడితే అక్కడ ప్లాస్టిక్ వ్యర్థాలు విసిరేస్తున్నారని వాటిని తిని ఆవుల్లాంటి మూగజీ వాలు మృత్యువాత పడుతున్నాయని ఆవేదన చెందారు. ఇదే స్థాయిలో ఇబ్బడి ముబ్బడిగా ప్లాస్టిక్ వాడితే బావితరాల వారి ఆరో గ్యం ప్రమాదంలో పడినట్లేనన్నారు. ప్లాస్టిక్ మహమ్మారిని కట్టడి చేయటంలో విఫలమైతే మానవాళి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని ఎవరికి వారుగా తగ్గించుకోవాలని సూచించారు. సంభంధిత వ్యర్థాల సద్వినియో గంపై ప్రభుత్వం శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రజావగాహన పెంపు తోనే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుందని అందుకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఆళ్ళ హరి కోరారు. తొలుత రాఘవయ్య పార్కులోని వ్యర్థాలను తొలగించి పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గేదెల నాగరంగ మణి, జనసేన నగర కార్యదర్శి షేక్ మెహబూబ్ బాషా, టీడీపీ డివిజన్ అధ్యక్షులు షేక్ నాగుర్, బీజేపీ నాయకులు అప్పిశెట్టి రం గారావు, బియ్యం శ్రీను, రెల్లి నేత సోమి ఉదయ్ కుమార్, సచివా లయం సిబ్బంది వరలక్ష్మి, సంధ్య, కమల, బ్రాహ్మణి, లింగాచారి, ప్రభు, వెస్లీ, డోలా లక్ష్మి, దివ్య, మౌనిక, సుజాత, లక్ష్మి తిరుపత మ్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

"జయకేతనం" సభ విజయవంతం

- ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు
- జనసేన పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత

మదనపల్లె, మార్చి 15 (జనస్వరం) : జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వ హించిన జయకేతనం సభ విజయవంతంగా జరిగింది. ఈ సభను అత్యంత ఆద్భుతమైన విధానం లో నిర్వహించి, పర్యవేక్షించి, కార్యాలయానికి అన్ని వర్గాల నుండి ప్రతీ ఒక్కరిని హర్షం వ్యక్తం చేయడంలో కీలక పాత్ర పోషించిన రాయలసీమ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత, నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలకు జనసేన పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ దారం అనిత ధన్యవాదాలు తెలియ జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాజంపేట పార్లమెంటు నియోజకవర్గాల నుండి వేలాది మంది సభకు తరలి వచ్చారని, కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, గమ్యస్థలాలపై సమగ్ర కట్టుబడితో ప్రతి ఒక్కరూ సమయానికి చేరుకున్నారని పేర్కొన్నారు. అంతే కాకుండా, పవణ్ కళ్యాణ్ తన ప్రసంగంలో పార్టీ గోచర్లను స్పష్టంగా వివరించి, రాత్రి 10 గంటల నుండి ప్రతి ఒక్కరూ తిరుగు పయనమయ్యారని ఆమె వెల్లడించారు. ఈ సభకు రెండు తెలుగు రాష్ట్రాల నుండి నాయకులు, కార్యకర్తలు లక్షలాదిగా తరలి వచ్చారని, సభ విశేషాలను ఆమె గౌర వంగా తెలియజేశారు.

స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంపై విద్యార్థుల ర్యాలీ

పులివెందుల, మార్చి 15 (జనస్వరం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర స్వర్ణా ంధ్ర అవగాహన కార్యక్రమంపై లింగాల హైస్కూల్ విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వ హించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల విద్యాసహాయకులు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను ఎప్పుడైతే మనం పరిశుభ్రంగా ఉంచుకుంటామో, అప్పుడే మన ప్రభుత్వ స్వప్నం సాకారమవుతుందని, స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమ విజయవంతానికి సమాజం లోని ప్రతి పౌరుడు పాటుపడినప్పుడే ప్రగతి సాధ్యమవుతుందని, పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు అకుంఠిత దీక్షతో మొక్కల పెంపకం, జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేయాలని పేర్కొన్నారు. అనంత రం ఏర్పాటు చేసిన మానవహారంలో ఉపాధ్యాయులు విద్యార్థులచే స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ భూములలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోండి

ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి

నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : జిల్లాలోని వరికుంటపాడు మండ లం, కనియంపాడు గ్రామంలో అగ్రిగోల్డ్ భూములను.. జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్, ఉదయ గిరి వైసీపీ ఇంచార్జ్ మేకపాటి రాజ గోపాల్ రెడ్డిలతో కలిసి వైసీపీ నెల్లూరు సిటీ ఇన్చార్జి, ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించారు. అధికార పార్టీ అండతో తెలుగు తమ్ముళ్లు సీఐడీ అండర్లో ఉన్న అగ్రిగోల్డ్ భూముల్లో కోట్ల రూపాయల విలువ చేసే జామా యిల్ చెట్లను యదేచ్ఛగా నరికి అమ్మి సొమ్ము చేసుకుంటున్న విషయాన్ని మీడియాకు వివరించారు. ఒక్క వరికుంటపాడు మండలంలోనే.. అగ్రిగోల్డ్కు సంబంధించి భూముల్లో కలపను అమ్మి టీడీపీ నేతలు రూ.మూడున్నర కోట్ల దోపిడికి పాల్పడ్డారని జిల్లా అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆరోపిం చారు. పేదలకు చెందాల్సిన అగ్రిగోల్డ్ భూములను.. ఇలా అక్రమంగా బక్కిస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరు కోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పేదలకు చెందాల్సిన అగ్రిగోల్డ్ భూముల్లో యదేచ్ఛగా అక్రమాలు జరుగుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారా అని మండిపడ్డారు. అగ్రిగోల్డ్ భూముల్లో ఇష్టారాజ్యంగా.. దోపిడీ జరుగుతుంటే.. రెవెన్యూ, పోలీసు వ్యవస్థల కళ్ళకు కనపడటం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికే అగ్రిగోల్డ్ భూము ల్లో 60 ఎకరాల్లో కలపను అక్రమంగా అమ్మి టీడీపీ నేతలు పేదల సొమ్మును దోచుకున్నారని ఆరో పించారు. అధికారుల కార్యాలయాలకు కూతవేటు దూరంలో ఉన్న భూముల్లోనే.. ఇలా జరిగింద ంటే ప్రజల ఆస్తులకు ఎలాంటి రక్షణ ఉంటుందో అర్థం కావడం లేదన్నారు. టీడీపీ నేతలే ఇలాంటి దోపిడీలకు పాల్పడుతుంటే.. అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం ఏమీ చేయలేక చేతులెత్తేసిందన్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వం మౌనం పాటిస్తుందంటే రేపు ప్రైవేటు వ్యక్తుల ఆస్తులకు రక్షణ.. ఉం టుందా అన్న సందేహం ప్రజల్లో ప్రతి ఒక్కరికి కలుగుతుందన్నారు. ఏపీలో ఎప్పుడు ఇలాంటి పరి స్థితులు.. చోటు చేసుకో లేదన్నారు.ఇప్పటికైనా ప్రజలు ఏకతాటిపై కొచ్చి.. తమకు జరుగుతున్న అన్యాయాలను.. అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వారు వరికుంటపాడు తహసి ల్దార్ను కలిసి అగ్రిగోల్డ్ భూముల్లో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై చట్టరిత్య చర్యలు తీసుకో వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

"పది" విద్యార్థులకు పరీక్ష పరికరాలు పంపిణీ

దెండులూరు, మార్చి 15 (జనస్వరం) : సంవత్సరం పాటు కష్ట పడి చదివిన విద్యార్థులు అందరూ బాగా పరీక్షలు రాసి విజయం సాధి ంచాలని స్థానిక ఆర్సీఎం చర్చి ఫాదర్ జి అమ్మన్ రాజా అన్నారు. శనివారం ఆర్సీఎం చర్చిలో 25 మంది విద్యార్థులకు ప్యాడ్లు, జామె ంట్రీ బాక్సులు పెన్నులు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్రంలో టెన్త్ పరీక్షలు రాసే అందరి కోసం ఫాదర్ అమన్ రాజా, ఫాదర్ కళ్యాణ్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఉత్తరాది రాజకీయ మాఫియా ఆధిపత్యాన్ని అడ్డుకోవాలి

- లేనిపక్షంలో దక్షిణాది రాష్ట్రాలకు బానిసత్వం తప్పదు

- దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు వడ్లమూరి కృష్ణ స్వరూప్

పాయకరావుపేట, మార్చి 15 (జనస్వరం) : ఉత్తరాది రాజకీయ మాఫియా ఆధిపత్యాన్ని అడ్డుకోకపోతే దక్షిణాది రాష్ట్రాలకు బానిసత్వం తప్పదని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షులు, సుప్రీం కోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. శనివారం హైదరాబాదులోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో కృష్ణ స్వరూప్ మాట్లాడుతూ దక్షిణాదిన ద్రావిడ ఉద్యమానికి ప్రధాన కేంద్రంగా ఉన్న తమిళనాడు ప్రజలను అనాగరికులు అంటూ పార్లమెంట్‌లో తమిళ ప్రజల ఆత్మ గౌరవాన్ని కించపరిచే విధంగా మాట్లాడిన కేంద్ర మంత్రి వీరేంద్ర ప్రధాన్ తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. హిందీ భాషను బలవంతంగా దక్షిణాది రాష్ట్రాలపై రుద్దే ప్రయత్నాలను మానుకోవాలన్నారు. ప్రతి రాష్ట్రానికి ఒక మాతృభాష ఉంటుందని, దాని తర్వాత అంతర్జాతీయ స్థాయిలో ఇంగ్లీషు రెండో భాషగా చలామణిలో ఉందన్నారు. ఉత్తరాది రాజకీయాధిపత్యం కోసం హిందీని బలవంతంగా రుద్దడం వల్ల 25 ప్రాంతీయ భాషలు ఉనికి కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. దేశానికి జాతీయ ఆదాయంలో దక్షిణాది రాష్ట్రాల నుండి 50 శాతం వరకు కేంద్రానికి ఆదాయం వస్తుందని, కానీ దక్షిణాది రాష్ట్రాలకు ఐదు శాతం నిధులు కూడా ఇవ్వకుండా ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించకుండా తీవ్ర వివక్షతకు చూపుతున్నారని విమర్శించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ప్రకటించిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు హైదరాబాద్ కేంద్రంగా, దేశానికి రెండో రాజధానిగా ఏర్పాటు చేయాలని, ఫెడరల్ రాజ్యాంగ భావనను రాష్ట్రాల అధికారాలను రక్షించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దక్షిణాది ప్రాంతాల అస్తిత్వం నిలబడాలంటే కచ్చితంగా హైదరాబాదును దేశానికి రెండో రాజధానిగా పాటించాల్సిందేనన్నారు. దీనిలో భాగంగా హైదరాబాదులో పార్లమెంటు భవనాలను, కేంద్ర ప్రభుత్వ సచివాలయాలను, సుప్రీం కోర్టు దక్షిణాది బెంచ్‌ను ఏర్పాటు చేయాలని కృష్ణ స్వరూప్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ గోలి నరేష్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మద్దిల ప్రవీణ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు బండారి లావణ్య, మాల మహానాడు జాతీయ ప్రధాన కార్యదర్శి సంకు శ్రీనివాసులు, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు జెఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

పాయకరావుపేట, మార్చి 15 (జనస్వరం) : మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం ముమ్మరంగా చేపట్టారు. పంచాయతీ అధికారులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా తడి చెత్త-పొడి చెత్త వేరు చేసే విధానం, ఐఎస్ఎల్ మరుగుదొడ్లు వాడే విధానం, ర్యాలీలు, చెత్త నుండి సంపద తయారీ కేంద్రాల్లో యాక్టివిటీస్, మొక్కలు నాటే కార్యక్రమం మొత్తం 17 థీమ్స్‌పై ప్రజలలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ జయప్రకాశ రావు, మండల ప్రత్యేక అధికారి జివి లక్ష్మీ, మండల విస్తరణ అధికారి సిహెచ్ చంద్రశేఖర రావు, అసిస్టెంట్ ఇంజనీర్లు ఆర్డబ్ల్యూఎస్ వర్మ, కచేరి ఎపిఎం వెలుగు, సర్పంచులు ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోము వీర్రాజును మర్యాదపూర్వకంగా కలిసిన నాయకులు



ప్రత్తిపాడు, మార్చి 15 (జనస్వరం) : బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు, నూతనంగా ఎన్నికైన సోము వీర్రాజును రాజమండ్రిలో వారి స్వగృహంలో బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు చిలుకూరు రామ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఉమ్మిడి వెంకట్రావు, బీజేపీ జిల్లా యువ మోర్చ అధ్యక్షులు పాపారావు, ప్రత్తిపాడు బీజేపీ మండల అధ్యక్షులు వూట వీరబాబు, రౌతులపూడి బీజేపీ మండల అధ్యక్షులు లౌడు శ్రీనివాస్, ప్రత్తిపాడు మండలం బీజేపీ ప్రధాన కార్యదర్శి గొనగాని గోపి, రౌతు లపూడి మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఎనుముల రాజా, ప్రతిపాడు మండలం ఉపాధ్యక్షులు నానిపల్లి శ్రీనివాస్, సీనియర్ బీజేపీ నాయకులు మాణిక్యం తదితరులు నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన ఎమ్మెల్సీ సోము వీర్రాజును శాలువాలు పూలదండలతో ఘనంగా సన్మానించారు

రాజవరంలో "స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర"

పాయకరావుపేట, మార్చి 15 (జనస్వరం) : మండలంలోని రాజవరం గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం పంచాయతీ అధికారులు చెత్త నుండి సంపద తయారు చేయడం, చెత్తను ఇంటి వద్దనే తడి, పొడి, ప్రమాదకర చెత్తగా వేరు చేయడంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ గోసల అమ్మాజీ, టీడీపీ సీనియర్ నాయకులు బొందు కాశీ విశ్వనాధ్, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు ఏడిద సురేష్, పిరమళ్ల నానాజీ, ముత్తి జగదీష్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీధి వ్యాపారులకు, షాప్ యజమానులకు చెత్త నుండి సంపద తయారీపై అవగాహన, తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ వ్యర్థాలు అనగా సింగిల్ యూస్ ప్లాస్టిక్ అయినటువంటి కవర్లు, ప్లాస్టిక్ స్పూన్లు తదితర ప్లాస్టిక్ వ్యర్థాలను నీలిరంగు డబ్బాలో వేసి స్వచ్ఛ రాయబారికి అందించాలని, రాజవరం పంచాయతీ కార్యదర్శి కర్రి నాగ సత్యనారాయణ ప్రజలకు అవగాహన కల్పించారు. అదేవిధంగా భూమిలో కుళ్లే తడి చెత్త అయినటువంటి మిగిలిపోయిన అన్నం, కూరగాయలు, ఆకులు, పువ్వులు, టీ పొడి, కాఫీ పొడి తదితర చెత్తను ఆకుపచ్చ డబ్బాలో వేరు చేసి ఇవ్వాలని, సిరంజీలు, సూదులు, నాప్కిన్స్, ప్రమాదకర రసాయనాలు వంటివి ఎరుపు రంగు డబ్బాలో వేసి స్వచ్ఛ రాయబారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ మేడిశెట్టి చిన్నారావు, ఫిషరీస్ అసిస్టెంట్ తమలపాకుల సంజీవిని, ఎఎన్ఎమ్ లోకవరపు సత్యవతి, వెలుగు సిబ్బంది యజ్జల కాశీరత్నం, మోసా అమ్మాజీ, ఆశావర్కరు చేదులూరి విజయ, విఆర్‌పి ఏడిద రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జనసేన ఆవిర్భావ దినోత్సవం వేడుకలు

విజయవాడ, మార్చి 15 (జనస్వరం) : జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గం 58వ డివిజన్లో పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి, మహిళలను జనసేన కండువాలతో సత్కరించారు. అనంతరం మ్యూజికల్ చైర్ గేమ్స్ నిర్వహించగా స్థానికులు ఆసక్తిగా పాల్గొన్నారు. విజేతలకు జనసేన గ్లాసులను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉండేది గేటెడ్ కమ్యూనిటీలో.. అమ్మేది గంజాయి..

- ముంబయి నుంచి నగరానికి కుష్ గంజాయి తీసుకొచ్చి అమ్మకాలు

- ఇద్దరు అమ్మకం దారులు.. నలుగురు కొనుగోలుదారుల అరెస్ట్

హైదర్‌నగర్, మార్చి 15 (జనస్వరం) : ఈజీగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో ముంబయి నుంచి నగరానికి వచ్చాడు అశిష్ కుమార్. గంజాయి అమ్ముతూ నగరంలో ఒకసారి పట్టుబడి బెయిల్‌పై విడుదలయ్యాడు. కుటుంబంతో కలిసిఉంటే మారుతాడని భావించిన తల్లిదండ్రులు ముంబయి నుంచి హైదరాబాద్‌కు మకాం మార్చి అతనితో కలిసి ఉంటున్నా అతని ప్రవర్తన మారలేదు. తీరు మార్చుకోకుండా తిరిగి అదే బాటపట్టి గంజాయి సేవించడంతో పాటు అమ్మకాన్నే వృత్తిగా ఎంచుకున్నాడు. కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ కాలనీలో పేరొందిన గేటెడ్ కమ్యూనిటీలో నివాసం ఉంటూ గంజాయి కావాల్సిన వాళ్లను అక్కడికే పిలుచుకుని అమ్మకాలు సాగిస్తున్నాడు. ముంబయిలో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై మౌనికారెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. తెలుసుకున్న అశిష్ కుమార్(29), కట్టెంపూడి సాత్విక్(20)లు పారిపోయేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి ఒక జ్యూట్ బ్యాగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో భద్రపరిచిన కుష్ గంజాయిని డబ్బాలో గంజాయి అమ్మకం ద్వారా వచ్చిన రూ.7500 నగదు స్వాధీనం చేసుకున్నారు.అశిష్?కుమార్‌ను పోలీసులను విచారించగా అతడికి గంజాయి సేవించే అలవాటు ఉందని, దాని కోసం ముంబయ్‌లో అమ్మేవారితో సంబంధాలు ఉండటంతో గంజాయి విక్రయాలు చేస్తూ, నగరంలో ఒకసారి పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చాడు. అశిష్ భవిష్యత్ కోసం కుటుంబం హైదరాబాద్ వచ్చి కేపీహెచ్‌బీలో ఉంటున్నారు. ఈనెల 10న తన స్నేహితుడు సాత్విక్‌ను ముంబయ్‌కు పంపి 260 గ్రాముల కుష్ గంజాయి, 1100 గ్రాముల గంజాయి తెప్పించాడు. దాన్ని చిన్నచిన్న ప్యాకెట్లుగా మార్చి గురువారం తెలిసిన కొంతమంది యువకులకు అమ్మేందుకు ప్రయత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు అశిష్, సాత్విక్‌ను అదుపులోకి తీసుకున్న సమయంలో గంజాయి కొనేందుకు పెరాల రాహుల్, పెరల ప్రత్యూష్, అబ్రార్‌ఖాన్, జైబుడ్డేలే అక్కడకు రాగా పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుండి 260గ్రాముల కుష్ గంజాయి. 1100గ్రాముల గంజాయి, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్‌పై ఉక్కుపాదం : ఏసీపీ

గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలు అమ్మేవారు చట్టం నుంచి తప్పించుకోలేరని, వీటిని వినియోగించేవారిపై నిత్యం నిఘా ఉంటుందని, కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు హెచ్చరించారు. ఇప్పుడు దొరికిన కుష్ గంజాయి అమెరికా నుండి దిగుమతి చేసుకుని మరీ అమ్మకాలు చేస్తున్నారన్నారు. దీని విలువ మామూలు గంజాయి కంటే చాలా ఎక్కుగా ఉంటుందని, కుష్ గంజాయి గ్రాము రూ. 3000పైనే ఉంటుందని, పట్టుబడిన గంజాయి విలువ రూ.10లక్షలు ఉండవచ్చునని ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు.

హైదరాబాద్ సుచిత్రలో కొత్త స్టోర్‌ను ప్రారంభం

హైదరాబాద్, మార్చి 16 (జనస్వరం) : భారతదేశ ప్రముఖ ప్రీమియం ఫ్యాషన్, బ్యూటీ, గిఫ్టింగ్ గమ్యస్థలమైన షాపర్స్ స్టాప్, హైదరాబాద్‌లోని సుచిత్రలో తన తాజా స్టోర్‌ను ప్రారంభించి, తన విస్తరణ ప్రయాణంలో మరో కీలక మైలు రాయిని చేరుకుంది. ఈ కొత్త స్టోర్ ముత్యాల నగరానికి ఒక అద్భుతమైన షాపింగ్ అనుభవాన్ని అందించనుంది. ఇందులో ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తుల ఎంపికను జాగ్రత్తగా కూర్చి ఉంచారు. షాపర్స్ స్టాప్ లిమిటెడ్ కస్టమర్ కేర్ అసోసియేట్, మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కవింద్ర మిశ్రా హైదరాబాద్‌లో కొత్త స్టోర్ ప్రారంభంపై స్పందిస్తూ "హైదరాబాద్ ఎప్పటికీ కీలక మార్కెట్‌గా ఉంది, వినియోగదారులతో మా సంబంధాన్ని మరింత బలోపేతం చేయడం మాకు ఎంతో ఉత్సాహాన్నిస్తుంది. సుచిత్రలోని ఈ కొత్త స్టోర్‌లో ఎంపిక చేసిన ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులతో మెరుగైన షాపింగ్ అనుభవాన్ని అందించడానికి మేము రూపకల్పన చేసాము. ప్రీమియం ఉత్పత్తులు, అత్యుత్తమ సేవ, వ్యక్తిగత అనుభవాలపై మా నిబద్ధత ఎల్లప్పుడూ స్థిరంగా ఉంటుంది. ఈ ప్రారంభంతో, భారతదేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రిటైల్ రంగానికి అనుగుణంగా షాపర్స్ స్టాప్ తన కట్టుబాటును కొనసాగిస్తోంది. సుచిత్ర స్టోర్‌లో ప్రడా, వెర్సాచీ, ఆర్మానీ ఎక్స్ఛేంజ్, సెలియో, రారా రాబిట్, టామీ హిల్ఫిగర్, వేరో మోడా, కాల్విన్ క్లైన్, రే-బాన్, బాస్, చోపార్డ్, ఓన్లీ వంటి అంతర్జాతీయ భారతీయ టాప్ బ్రాండ్ల విస్తృత శ్రేణిని ప్రదర్శిస్తారు. వీటిలో కొన్ని బ్రాండ్లు ఈ ప్రాంతంలో కేవలం షాపర్స్ స్టాప్ ద్వారానే అందుబాటులో ఉంటాయి. కొత్త షాపర్స్ స్టాప్ స్టోర్, సుచిత్ర వినియోగదారులకు ఒక అద్వితీయమైన, ప్రత్యేకంగా రూపొందించిన షాపింగ్ అనుభవాన్ని అందిస్తుంది, ఇందులో ప్రత్యేక షాపింగ్ లౌంజ్ బ్రాండ్ నిపుణులైన పర్సనల్ షాపర్స్ ద్వారా వ్యక్తిగత సహాయం లభిస్తుంది. వినియోగదారులు ప్రముఖ బ్రాండ్ల ఎంపికను అన్వేషించవచ్చు, వ్యక్తిగత సేవలను ఆస్వాదించవచ్చు, స్టైల్, శ్రేణి, ప్రీమియం కస్టమర్ సర్వీస్‌ల సమ్మేళనంతో తమ షాపింగ్ అనుభవాన్ని మరింత అభివృద్ధి చేసుకోవచ్చు. షాపర్స్ స్టాప్ హైదరాబాద్‌లోని వినియోగదారులను ఒకే చోట ప్రీమియం ఫ్యాషన్, బ్యూటీ, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులను అనుభవించేందుకు ఆహ్వానిస్తున్నందుకు ఉత్సాహంగా ఉంది" అని తెలిపారు.

పిప్రి బుద్ధ విహార్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు తొలగింపు

భైంసా, మార్చి 15 (జనస్వరం) : పట్టణంలోని బుద్ధ విహార్ టెక్డి వద్ద ప్రతి ఆదివారం బుద్ధ విహార్ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో బుద్ధ వందనాలు నిర్వహిస్తారు. బుద్ధ విహార్ కు బుద్ధ వందనానికి రావాలని శనివారం బుద్ధ విహార్ కమిటీ సభ్యులు పిప్రి కాలనితో పాటు శాస్త్రి నగర్‌లో ఇంటింటికి ప్రచారం చేశారు. ముందుగా పిప్రి కాలనీ ఉన్న బుద్ధ విహార్ ప్రాంగణంలో ఒక వైపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు నిర్వాహణ

పాయకరావుపేట, మార్చి 15 (జనస్వరం) : మండలంలోని శ్రీరాంపురం, వెంకటనగరం గ్రామాల్లో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వాడకం వలన కలిగే అనర్థాలు, నష్టాలపై స్థానికులకు అవగాహన కల్పించామని పంచాయతీ కార్యదర్శి వైవి సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఈ రెండు గ్రామాల్లోనూ ముమ్మరంగా పరిశుధ్య పనులు చేపట్టామన్నారు. తడి చెత్త-పొడి చెత్త వేరు చేసే విధానం పట్ల గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను సందర్శించి సిబ్బందికి తగు సూచనలు అందించామని కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ, గ్రామ సచివాలయ, వెలుగు సిబ్బంది, హరిత రాయబారులు, స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాటుసారా విక్రయిస్తే కఠిన చర్యలు

పాయకరావుపేట, మార్చి 15 (జనస్వరం) : నాటుసారా విక్రయించినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి శ్రీనివాసు హెచ్చరించారు. శనివారం మండలంలోని గజపతినగరం, రాజానగరం, కుమారపురం గ్రామాల్లో నిర్వహించిన నాటుసారా రహిత ఆంధ్రప్రదేశ్ "నబోదయం 2.0" కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నాటుసారా వలన కలిగే అనర్థాలు, నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. నాటుసారా విక్రయించినా, తయారు చేసినా, రవాణా చేసినా ప్రభుత్వం విధించే శిక్షలను గూర్చి వివరించారు. నాటుసారా కేసుల్లో పట్టుబడితే మండల మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచి, వారిని బౌండ్ ఓవర్ చేయడం జరుగుతుందన్నారు. మరోసారి పట్టుబడితే రూ.లక్షలు జరిమానా లేదా ఏడాది జైలు శిక్ష విధిస్తారని హెచ్చరించారు. గ్రామాల్లో నాటుసారా విక్రయించినా, రవాణా చేసినా టోల్ ఫ్రీ నెంబరు 14405కు తెలియజేయాలని గ్రామస్తులకు కోరారు.

స్వచ్ఛత - పరిశుభ్రత ప్రతి పౌరుని బాధ్యత

మున్సిపల్ కమిషనర్ రాముడు

పులివెందుల, మార్చి 15 (జనస్వరం) : పట్టణంలోని బాకరాపురం ప్రాంత సమీపంలో లయోలా డిగ్రీ కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో కలిసి శనివారం పట్టణ మున్సిపల్ కమిషనర్ రాముడు, కళాశాల యాజమాన్యం ఆంటోనీ స్వామి, ప్రిన్సిపల్ జోజి రెడ్డి, వన చిన్నప్పా స్వచ్ఛత – పరిశుభ్రత కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మన పరిసర ప్రాంతాలలో పారిశుధ్య సిబ్బంది మాత్రమే చెత్త నిర్వహణ బాధ్యత కాదని, ప్రజల్లో నుంచి కూడా చైతన్యం రావాలని, ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దీవస్ కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, స్వచ్ఛతను కాపాడటం అనేది మన అందరి బాధ్యత అని, ఇంటి లోపల మాత్రమే కాదని, ఇరుగు పొరుగు పరిసరాలను కూడా శుభ్రం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని అంతేకాకుండా సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాల్సిన బాధ్యత మనపై ఉందని కళాశాల ప్రిన్సిపల్ పేర్కొన్నారు. కరపత్రాలను పంచి ప్రజలకు మరింత అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉమెన్ సెల్ కో ఆర్డినేటర్ కళ్యాణి రెడ్డి, గణిత శాస్త్ర గంగా దేవి, వెలవలి సుధీర్, డాక్టర్ ఉదయ్, రమణా రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొని జయప్రదం చేశారు.

ఆధ్యాత్మిక యాత్ర చేస్తున్న బి.వి.రామ్

- కాశీ విశ్వేశ్వరుడి దర్శనం
- ప్రయాగ్‌రాజ్ త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం
- ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ప్రార్థన
- సీఎం చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి, సంక్షేమ పరిపాలన
- జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం కావడం పట్ల హర్షం



ప్రయోగరాజ్, మార్చి 15 (జనస్వరం) : తెలుగు శక్తి అధ్యక్షుడు బివి రామ్ ఆధ్యాత్మిక యాత్ర చేస్తున్నారు. శనివారం ప్రయోగరాజ్‌లోని త్రివేణి సంగమంలో పవిత్ర స్నానం ఆచరించారు. అంతకుముందు శుక్రవారం కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని ఆ భగవంతుడిని వేడుకున్నానని తెలిపారు. మరోవైపు సీఎం చంద్రబాబు నేతృత్వంలో.. ఏపీలో అభి వృద్ధి, సంక్షేమ పరిపాలన కొనసాగుతోందన్నారు. ఈ సుపరిపాలనకు కాశీ విశ్వేశ్వరుడి ఆశీస్సులు తోడైతే ప్రజలకు అంతకన్నా కావలసింది ఏముంటుందన్నారు. ఇదిలా ఉండగా పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ సభ విజయవంతం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

మైహోమ్ ఇండస్ట్రీస్‌లో "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర"

యలమంచిలి, మార్చి 15 (జనస్వరం) : మండలంలోని ములకలాపల్లి గ్రామంలో ఉన్న మైహోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ (సిమెంట్ ఫ్యాక్టరీ)లో శనివారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన "స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమం భాగంగా రోడ్ల శుభ్రపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం అనకాపల్లి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేయగా ఫ్యాక్టరీ సీనియర్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) బి.రామస్వామి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి ఉప తహశీల్దార్ వినయ్ కుమార్, మండల వీఆర్వోలు, ఫ్యాక్టరీ సీనియర్ జీఎం (ఆపరేషన్స్) బి.రామస్వామి, సీనియర్ డీజీఎం (పి.అండ్.ఎ) ఎల్.శ్రీనివాసరావు, ఇతర ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప తహశీల్దార్ వినయ్ కుమార్ మాట్లాడుతూ, "మనం పనిచేసే స్థలాలు కాకుండా, మనం నివసించే పరిసరాలను కూడా ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని" అన్నారు. "ఇదివ్వగా, రోగాలకు దూరంగా ఉండవచ్చు" అని ఆయన సూచించారు.

లోవ పాలం గ్రామంలో తాగునీరు సౌకర్యం కల్పించాలి

యలమంచిలి, మార్చి 15 (జనస్వరం) : నియోజకవర్గంలోని రాంబిల్లి మండలం, జడ్ చింతవాపంచాయితీ శివారు లోవ పాలెం, గజ రెడ్డిపాలెం గ్రామాల్లో శనివారం సీపీఎం నాయకులు ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా వారి దృష్టికి లోవపాలెం గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో ఖాళీ బిందెలతో వచ్చి మాకు కాలనీ ఏర్పడినప్పుడు నుండి తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులకు, నాయకులకు చెప్పినా మా సమస్య పరిష్కారం కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి జి దేవుడు నాయుడు మాట్లాడుతూ ఈ గ్రామం మండల కేంద్రానికి అతి దగ్గరలో ఉన్న ఈ గ్రామానికి తాగునీరు అందించకపోవడం అంటే అత్యంత దుర్మార్గమన్నారు. ఎస్సీ జెడ్ పరిధిలో ఈ రెవిన్యూ పరిధిలో వందల ఎకరాల భూములు తీసుకున్న పరిశ్రమలు వచ్చిన, కనీసం సీఎస్ఆర్ ఫండ్స్ ఉపయోగించిన తాగునీరు మౌలిక సదుపాయాలు కల్పించవలసిన బాధ్యత ఉందని, అయినా ఈ గ్రామాన్ని పట్టించుకోకపోవడం అంటే ఎంత దారుణమన్నారు. ప్రభుత్వం, అధికారులు ఇప్పటికైనా తక్షణమే స్పందించి ఈ గ్రామానికి తాగునీరు అందించకపోతే గ్రామ సచివాలయాల వద్ద, మండల ఆఫీస్ వద్ద మహిళలందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు నాగ మంత్రి నారాయణ రావు, ఎర్రి పిల్లి రాము, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

మహిళ హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

పులివెందుల, మార్చి 15 (జనస్వరం) : వైఎస్సార్ జిల్లా మలాపురంలో మూడు రోజుల క్రితం మహిళ హత్యాయత్నం కేసులో నిందితుడిని శనివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ దుర అలవాట్లకు గురైన ఆకుల నవీన్ అనే వ్యక్తి అప్పుల పాలయ్యా డన్నారు. తన వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను లక్ష్మీదేవి వద్ద రూ.30 వేలకు తాకట్టు పెట్టారన్నారు. ఆ అప్పులు తీర్చుకోవడానికి అదే మహిళా మెడలో ఉన్న సరుడు (బంగారు చైను) లాక్కెళ్ళేందుకు నవీన్ ప్రయత్నించాడని తెలిపారు. మూడు రోజుల క్రితం ఇంటిలో ఒంటరిగా ఉన్న లక్ష్మీదేవిని మెడలో ఉన్న సరుడు కావాలని కోరారు. ఆమె తిరస్కరించడంతో ఆమెపై విచక్షణారహితంగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఈ సంఘటనపై నమోదు చేసుకున్న అనంతరం సదరు నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టామన్నారు. ఈ నేపథ్యంలో నవీన్‌ను శనివారం అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్పీ వెల్లడించారు.

స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రతో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసుకుందాం

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్

నంద్యాల, మార్చి 15 (జనస్వరం) : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములై పరిశుభ్రమైన రాష్ట్ర నిర్మాణానికి కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని చిన్నచెరువు కట్ట వద్ద స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జెండా ఊపి ప్రారంభించారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర జిల్లా ఇంచార్జి స్పెషల్ అధికారి జె నివాస్, ఎమ్మెల్సీ ఇస్సాక్ బాషా, జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి, జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నీసా తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ప్రభుత్వ కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ ప్రతినెల మూడో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలందరినీ భాగస్వామ్యం చేయడంతో పాటు ప్రతి ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకొంటూ రాష్ట్రాన్ని పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు సీఎస్ తెలిపారు. స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో చెత్తాచెదారం తొలగింపు, ప్లాస్టిక్ పేపర్లను తొలగించడం తదితర రకరకాల పరిశుభ్రత పనులు చేపట్టి స్వచ్ఛ ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే చిన్నచెరువు కట్టపై ఉన్న చెత్తాచెదారాలను తొలగించడంతో పాటు వాకింగ్ ట్రాక్‌ను మెరుగులు దిద్ది అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు వివరించారు. మన పరిసరాల పరిశుభ్రతతో పాటు, మనం పని చేస్తున్న ప్రదేశాలు, మన ఆలోచనలు కూడా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. ఎప్పుడైతే అన్ని ప్రదేశాలలో పరిశుభ్రతకు స్థానం కల్పిస్తారో తద్వారా వార్డు, పట్టణం, జిల్లా, రాష్ట్రం పరిశుభ్రంగా ఉంటాయని ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉన్నట్లయితే పరిశుద్ధమైన ఆలోచనలు కూడా పెంపొందించుకోవచ్చన్నారు. ప్రతినెల ఒక కార్యక్రమం చొప్పున ఈ నెలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం, పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం అనే థీమ్‌పై ప్రజల్లో అవగాహన కల్పించి ప్లాస్టిక్ రహిత సమాజంగా తీర్చిదిద్దాలని ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాలు, పట్టణాలలో పరిశుభ్రత కార్యక్రమాలు ముమ్మరం చేసి ప్రజలందరూ పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. ప్రభుత్వం చేపట్టిన పరిశుభ్రత కార్యక్రమంలో ప్రజలందరూ వడివడిగా అడుగులు వేసి రాష్ట్రాన్ని పరిశుభ్రమైన రాష్ట్రంగా తీర్చిదిద్దాలని కోరారు. అంతకుముందు చెరువుగట్టుపై మొక్కలు నాటే కార్యక్రమంలో సీఎస్ పాల్గొని మొక్కలను నాటి నీళ్ళు పోశారు. జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా ప్రతి నెలా 3వ శనివారం నెలకొక థీమ్ చొప్పున పరిశుభ్రత కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ప్రజలందరి చేత స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి ఆర్డీఓ విశ్వనాథ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీ లేని సమాజాన్ని నిర్మించుకుందాం

ప్రతి వస్తువుకు తప్పనిసరిగా రసీదు ఉండాలి

నంద్యాల, మార్చి 15 (జనస్వరం) : నేడు సమాజంలో ప్రతి ఒక్కటి కల్తీమయం అయిపోయిందని, కల్తీ లేని సమాజాన్ని నిర్మించుకునేందుకు అందరము పోరాటం చేయాల్సిన అవసరం ఉందని కొన్న ప్రతి వస్తువుకు రసీదు ముఖ్యమని శ్రీ రామకృష్ణ కళాశాల డీన్ అకాడమిక్ ఏఎస్ ప్రగతి రెడ్డి పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రగతి రెడ్డి అధ్యాపకులు ఇంతియాజ్ అహ్మద్ శ్రావణీ కుమారి, సాధిక్‌తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు. వినియోగదారులు వాణిజ్య ప్రకటనలు, వ్యాపార సంస్థల డిస్కౌంట్లకు, ఆఫర్లకు ఆకర్షితులై మోసపోతున్నారన్నారు. ముఖ్యంగా రియల్ ఎస్టేట్ సంస్థలు, బిల్టర్స్, ఇన్సూరెన్స్ కంపెనీలు, ప్రముఖ మాల్స్ ఎక్కువగా ఇటువంటివి చేస్తుంటాయి. కానీ అమలులో ఇవి కనిపించవు అందుకే వీటి పైన ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఎలాంటి కొనుగోళ్లు, లావాదేవీలు చేసినా వినియోగదారుడు బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మార్చి 15 తేదీనే 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం'గా పరిగణించాలని తీర్మానించారు. దాంతో 1973 నుంచి ప్రపంచవ్యాప్తంగా మార్చి15 రోజే వినియోగదారుల హక్కుల దినంగా పాటించడం మొదలు పెట్టాయన్నారు. "ఈ చట్టం ప్రకారం ప్రతి కొనుగోలుదారులు కొన్ని ప్రత్యేక హక్కులు కలిగి ఉంటారని తెలుపుతూ కొనే వస్తువులు పొందే సేవలు వినియోగదారులు తక్షణ అవసరాలు తీర్చడమే కాకుండా అవి సుదీర్ఘ కాలం మన్నేలా ఉండాలి. అలా కాకుండా కల్తీ జరిగి వినియోగదారుల జీవితాలకు, ఆస్తులకు నష్టం కలిగించే విధంగా ఉండకూడదు. ఈ భద్రత పొందటానికి వినియోగదారులు కొనే వస్తువుల నాణ్యతను నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. వీలైనంత వరకు ఐఎస్ఐ, అగ్మార్క్, హాల్మార్క్ వంటి నాణ్యతా చిహ్నాలు గల వస్తువులనే కొనుగోలు చేయాలి.మనం ఒక ప్రొడక్ట్ నీ కొనేటప్పుడు ముఖ్యంగా వాటి నాణ్యత చూడాలి అది చాలా ముఖ్యం అలాగే మనం అందులో ఏదైనా తప్పు ఉంటే ప్రశ్నించే హక్కు మనకు ఉంది. కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉంది. కానీ ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువై పోయాయి. చివరికి మనం తాగే పాళ్లు, నీళ్లలో కూడా నాణ్యత లేకుండా పోతుంది. తూకాల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్పు న్యాయం జరగడం లేదు. ఈ తరహా మోసాలను అరికట్టాలంటే వినియోగదారులే మేల్కొనాల్సిన అవసరం చాలా ఉంది. తమ హక్కులపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరముంది. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా వినియోగదారులకు అవగాహన కలిగి ఉండాలి" అని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించి, వేతనాలు పెంచాలి

జిల్లా కలెక్టర్‌కు సీఐటీయూ వినతి



యలమంచిలి/అచ్యుతాపురం, మార్చి 15 (జనస్వరం) : మండలంలో గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శనివారం అచ్చుతాపురం మండలం ఎం.జగన్నాథపురం గ్రామానికి వచ్చిన అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్‌కి సీఐటీయూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, మండల కార్యదర్శి కే.సోమునాయుడు మాట్లాడుతూ 25 సంవత్సరాలు పైబడి ఎండకు ఎండి వానకు తడిసి గ్రామపంచాయతీ కార్మికులుగా పని చేస్తున్న కార్మికులకు పని ఎక్కువ జీతం తక్కువగా ఉన్నాయని, చాలీచాలని జీతాలు చెల్లిస్తున్నారని, దీంతో వీరి ఆరోగ్యాలను పణంగా పెట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్న గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం నెలకు పదిహేను వేల రూపాయలు ఇవ్వాలని, బకాయి జీతాలు చెల్లించి గుర్తింపు కార్డులు, ఈఎస్ఐ, పీఎఫ్, సెలవులు వంటి సౌకర్యాలు కల్పించాలని, దిబ్బపాలెం, పూడిమడక పంచాయతీ కార్మికులకు ఆదివారం సెలవు ఇవ్వాలని, రిటైర్ అయిన వారికి గ్రాడ్యుటి, పింఛన్ సౌకర్యం కల్పించాలని పనిలో ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం లేదా పంచాయతీ వైద్య సేవలు అందించి, గ్లౌజులు, బూట్లు, మాస్కులు, నూనె, సబ్బులు, పనిముట్లు నాణ్యమైనవి సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల కన్వీనర్ ఆడారి.నాగేశ్వరరావు, నాగమణి, శ్రీరాములు, రమణ,కల్యాణి మండలంలో వివిధ గ్రామ పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

నెల్లూరు రూరల్‌లో శరవేగంగా అభివృద్ధి పనులు

- రూరల్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తా
- కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి



నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : రూరల్ నియోజకవర్గ పరిధిలోని 30వ డివిజన్, వైఎస్ఆర్ నగర్ ప్రధాన రహదారి రూ.60 లక్షల వ్యయంతో చేస్తున్నటువంటి పనులకు శనివారం మాజీ మేయర్ నంది మండలం భానుశ్రీతో కలసి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే 30వ డివిజన్‌లో అభివృద్ధి పనులకు రూ.5 కోట్ల నిధులు కేటాయించి, శివారు ప్రాంతాల అభివృద్ధికి రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు. రూరల్ నియోజకవర్గానికి అభివృద్ధి పనులకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న సీఎం చంద్రబాబుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కి, యువ నాయకుడు, రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రూరల్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని, రూరల్ అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని తెలిపారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని మూడోసారి భారీ మెజారిటీతో గెలిపించిన, రూరల్ ప్రజలకు మేము రుణపడి ఉంటామని, నిరంతరం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ మన్నేపల్లి రఘు, మాజీ ఏ.ఎం.సీ.చైర్మన్ కూకటి హరిబాబు యాదవ్, టీడీపీ నాయకులు అత్తివరపు యానాదయ్య, మన్నెమాల శ్రీనివాసుల రెడ్డి, జమీర్ భాయ్, వెంకట లక్ష్మి, హఫీజ్ హుస్సేన్, షేక్ అస్లాం భాయ్, విగ్నేశ్వర రావు, ఆకునూరి అజయ్ కుమార్, కలవలపూడి సురేష్, చాణిక్యపురి మస్తాన్, అట్ల విజయ్ రెడ్డి, కొండూరు మహేష్, మల్లి సుబ్బారాయుడు, తురక కృష్ణ, తురక ఆనంద రావు, ప్రభాకర్, బంగారు రావణయ్య, రాముడు, లక్ష్మణ్, ఢిల్లీ బాబు, అయ్యప్ప, బంకాపూరి రాజేష్, వెంకీ, లెక్కల శివ రెడ్డి, రమేష్, ధర్మ, బుజ్జయ్య, సిద్దని విక్రమ్, దుర్గ ప్రసాద్, అహ్మద్, నజీర్ బాషా, జిలాని బాషా, ఖాసీమ్, రసూల్ బాషా, గోరె భాయ్, ఖాదర్ బాషా, షాహుల్, నాగేశ్వర రెడ్డి, శంకర్, ముజీబ్, శేషయ్య, ఝాన్సీ, అరిఫా, బీజేపీ నాయకులు వెంకట రావు, తోట సుబ్బా రావు, వేణు తదితరులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకే శక్తి బృందాలు

- శక్తి యాప్ మహిళలకు వజ్రాయుధం
- చింతపల్లి అదనపు ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా

చింతపల్లి, మార్చి 15 (జనస్వరం) : మహిళల రక్షణ కోసం శక్తి బృందాలను ప్రారంభిం చడం జరిగిందని, నేటి నుంచి మహిళల భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు చిం తపల్లి సబ్ డివిజన్ అదనపు ఎస్పీ నవజ్యోతి మిశ్రా అన్నా రు. శనివారం సీఐ వినోద్ బాబు, ఇతర సిబ్బందితో కలిసి శక్తి బృందం వాహనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి మహిళల భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు, శక్తి యాప్ మహి ళల రక్షణకు వజ్రాయుధం వంటిదని, చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరు శక్తి యాప్‌ను వారి ఫోనులో నిక్షిప్తం చేసుకోవాలని సూచించారు. అత్యాధునిక సాంకేతికతతో ప్రత్యేక పోలీసింగ్ ద్వారా తక్షణ సహాయం అందించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. శక్తి యాప్ ద్వారా రక్షణ పొందే వివరాలను వివరించారు. అందులో భాగంగా సింగిల్-టచ్ ఎస్ఓఎస్ బటన్ ద్వారా ఒక్క టచ్‌తో పోలీసులకు సిగ్నల్ వెళ్లి తక్షణ సహాయం అందుతుందన్నారు. షేక్ ట్రిగ్గర్/హ్యాండ్ గెస్చర్ ద్వారా యాప్ తెరవకుండానే అత్యవసర సంకేతాలను పంపే వీలుందని, లైవ్ ట్రాకింగ్, ఆధారాల పంపిణీ కాలర్ జీపీఎస్ స్థాన సమాచారం, 10-సెకన్ల ఆడియో, వీడియో కంట్రోల్ రూమ్‌కు పంపి ంచబడుతుందన్నారు. తద్వారా వేగంగా స్పందించవచ్చని తెలిపారు. అలాగే శక్తి యాప్ అదనపు ఫీచర్లను వివరించారు. వాటిలో ఫిర్యాదు నమోదు, మిస్సింగ్ చిల్డ్రన్ నివేదిక, అక్రమ కార్యకలాపాల నివేదిక, రాత్రి ఆశ్రయాల సమాచారం, సురక్షిత ప్రయాణ సౌకర్యం, పోలీస్ కాంటాక్ట్‌లను పొంద డం వంటి సమాచారంతో పాటు వాట్సాప్ పరిపాలన, అత్యవసర కాంటాక్టుల వివరాల వంటివి పూర్తిగా ఉంటాయని తెలిపారు. చింతపల్లి సబ్ డివిజన్‌లో శక్తి బృందం ప్రారంభించడం ద్వారా మహిళల భద్రతపై పోలీస్ విభాగం కట్టుబడి ఉందని, మరోసారి రుజువు చేసిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా పాజిటివ్ పోలీసింగ్ ద్వారా మహిళలకు మరింత భద్రత కల్పించడమే లక్ష్యం గా బృందం పని చేస్తుందన్నారు. మహిళలు తమ భద్రత కోసం శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వెంకటేశ్వరరావు, మహిళా హెూం గార్డు సునీత, మహిళ పోలీస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి కారకులైన ముగ్గురు ఉపాధ్యాయులు సస్పెండ్

పాడేరు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని

చింతపల్లి, మార్చి 15 (జనస్వరం) : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల-2 విద్యార్థి పాంగి యోసేపు నీటి కుంటలో పడి మృతి చెందిన ఘటనకు సంబంధించి పాఠశాలలోని ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని పాడేరు విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ రజిని తెలిపారు. శనివారం ఆమె స్థానిక పాత్రికేయులతో మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాల-2 విద్యార్థి పాంగి యోసేపు నీటి కుంటలో పడి మృతి చెందడం దురదృష్టకరమన్నారు. విద్యార్థి మృతిపై అల్లూరి జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు స్థానిక ఏటిడబ్ల్యూఓ జయ నాగలక్ష్మి తో కలిసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. సమగ్ర విచారణ అనంతరం వసతి గృహ వార్డెన్ ఉగ్రంగి గణేష్, వ్యాయామ ఉపాధ్యాయుడు (పిడి) అప్పన్న, ఇంగ్లీష్ ఉపాధ్యాయుడు సతీష్ కుమార్ ల అలసత్వం వలనే విద్యార్థి మృతి చెందినట్లుగా నిర్ధారించి వారిని అల్లూరి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేసినట్లు తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పండన్నపై సుదీర్ఘంగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా ఉదయగిరిని తీర్చిదిద్దుదాం

- ప్లాస్టిక్ వినియోగం క్యాన్సర్‌కు కారణం పర్యావరణానికి హానికరం
- స్వేచ్ఛ ఆంధ్ర-స్వేచ్ఛ దివస్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : ఉదయగిరి నియోజకవర్గం ప్లాస్టిక్ రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దుదామని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. శనివారం వింజమూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, మండల అధికారులు స్థానిక నాయకులతో కలిసి స్వేచ్ఛ ఆంధ్ర – స్వేచ్ఛ దివస్ ర్యాలీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. స్థానిక హై స్కూల్ నుండి పాత బస్టాండ్ సెంటర్ వరకు ప్లాస్టిక్ నిషేధంపై నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వింజమూరు పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీ కాకర్ల సురేష్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మూడవ శనివారం స్వేచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పిలుపుమేరకు నిర్వహిస్తున్నామని తెలిపారు. సింగల్ యూస్ ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాలపై ప్రజలు తెలుసుకోవాలన్నారు. నియోజకవర్గంలోని అన్ని పంచాయతీలలో ప్రజలను భాగస్వామ్యం చేస్తూ ప్లాస్టిక్ వాడకం నిషేధంపై అవగాహన కార్యక్రమాలు పెద్ద ఎత్తున నిర్వహించాలని తెలిపారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రజలందరూ తోడ్పాటును అందించాలన్నారు. ప్రతి ఒక్కరూ క్లాత్ బ్యాగులను ఉపయోగించాలని తెలిపారు. అనంతరం దుకాణదారుల వద్దకు వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకం వలన క్యాన్సర్ బారిన పడటం ఖాయమని, ప్లాస్టిక్ నిషేధించడం ద్వారానే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చన్నారు. ప్లాస్టిక్ నిషేధించడం ద్వారా మన ఆరోగ్యంతో పాటు పర్యావరణాన్ని కూడా కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆ దిశగా పయనించాలని పిలుపునిచ్చారు. ముందుగా వింజమూరు సర్పంచ్ దంపతులు నల్లగొండ్ల సృజన రాయుడు దంపతులు ఎమ్మెల్యేని శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గొంగటి రఘునాథ రెడ్డి, మాజీ మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్ల యాదవ్, పట్టణ అధ్యక్షులు కోడూరు నాగిరెడ్డి, సీనియర్ నాయకులు గువ్వల కృష్ణారెడ్డి, వని పెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, మంచాల శ్రీనివాసులు నాయుడు, పాములపాటి మాల్యాద్రి, గణపం సుదర్శన్ రెడ్డి పెంచల్ రెడ్డి, రమణారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, ఎంఈఓ మధుసూదన్ రెడ్డి, సీడీపీఓ పద్మజ కుమారి, ప్రధానోపాధ్యాయులు సిహెచ్ మాలకొండ రావు, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

ఘనంగా సర్వోదయ కళాశాల విశ్రాంత ఉద్యోగుల స్వర్ణోత్సవ సమావేశం

నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : నగరంలోని సర్వోదయకళాశాల స్థాపించి నేటికీ 50 సంవత్సరాలు అయిన శుభ సందర్భంగా సర్వోదయ కళాశాల విశ్రాంత అధ్యాపక, అధ్యాపకేతర ఉద్యోగుల ఆధ్వర్యంలో శనివారం స్వర్ణోత్సవ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకులు సుబ్బరామయ్య, పురుషోత్తం మాట్లాడుతూ సర్వోదయ కళాశాల స్థాపించి నేటికి 50 సంవత్సరాలైన సందర్భంగా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ సమావేశాన్ని ఘనంగా నిర్వహించామన్నారు. సర్వోదయ కళాశాల 1972 ఆగస్టు 14న స్థాపించారు అప్పటి నుండి తాము కళాశాలలో అధ్యాపకులుగా పనిచేసి రిటైర్డ్ అయ్యామన్నారు. అయినా కళాశాల మీద ప్రేమాభిమానాలతో కళాశాల స్థాపించి 50 సంవత్సరాల అయిన సందర్భంగా ఈ కళాశాలలో పనిచేసిన అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశం నిర్వహిద్దామని ఆలోచనతో ఈ సమావేశాన్ని నిర్వహించామన్నారు. 120 మంది విద్యార్థులతో స్థాపించిన ఈ కళాశాల నేడు 6000 మంది విద్యార్థులతో విరాజిల్లుతున్న దన్నారు. ఈ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు నేడు రాజకీయ, వ్యాపార, అనేక రంగాలలో స్థిరపడ్డారన్నారు. ఈ కళాశాల ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థితికి చేరుకోవడానికి దోహదపడిందన్నారు. నేటికి సర్వోదయ కళాశాల అంటే ఒక బ్రాండ్ అంబాసిడర్‌గా నిలిచిందన్నారు. దానికి కారణం ఈ కళాశాలను స్థాపించిన మహానుభావులు, అధ్యాపకులు వల్లేనని తెలిపారు. అనంతరం విశ్రాంత అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్వోదయ కళాశాల కరస్పాండెంట్ హేమచంద్రరావు, యానాదిశెట్టి, పిచ్చయ్య, సివి కోటేశ్వరరావు, సుందర్ రెడ్డన్న విశ్రాంత అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నంద్యాలలో ఆధునిక వైద్య సేవలు ప్రారంభం

మార్చి 16 నుండి 31 వరకు ఉచిత ఓపిడి సేవలు అందిస్తారు

నంద్యాల, మార్చి 15 (జనస్వరం) : స్థానిక పద్మావతి నగర్ మెయిన్ రోడ్డులో ఎముకలు, కీళ్ల శస్త్ర చికిత్సల నిపుణులు డాక్టర్ జొన్నలగడ్డ వికాస్, నేత్ర వైద్య నిపుణురాలు డాక్టర్ కృష్ణ సాహితిల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన విష్ణా ఆసుపత్రి శనివారం జ్యోతి ప్రజ్వలన చేసి నంద్యాల ప్రముఖ వైద్యులు ప్రారంభించారు. ప్రధాన భవనాన్ని డాక్టర్ వికాస్ తండ్రి బద్రి నారాయణ ప్రారంభించగా, రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, ఐఎంఏ నంద్యాల అధ్యక్షుడు డాక్టర్ మధుసూదన రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, నంద్యాల కార్యదర్శి డాక్టర్ పనిల్ కుమార్, సీనియర్ వైద్యులు డాక్టర్ సహదేవుడు, రాష్ట్ర కమిటీ సభ్యులు డాక్టర్ మధుసూదన రెడ్డి, డాక్టర్ వసుధ రాణి, మహిళా వైద్య విభాగం నాయకులు డాక్టర్ లక్ష్మీ సౌజన్య, డాక్టర్ నర్మద, డాక్టర్ నాగమణి, ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ లక్ష్మయ్య, ప్రముఖ ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ మురళి, డాక్టర్ జగన్, ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్, ఓపీడీ, స్పెషల్ రూమ్స్ విభాగం, జనరల్ వార్డు, ఎమర్జెన్సీ చికిత్స విభాగం, లేబరేటరీ, ఎక్సరే విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి కృష్ణ, డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ నంద్యాలలో అత్యాధునిక వసతులతో ఎముకలు కీళ్ల శస్త్ర చికిత్సల విభాగం, నేత్ర చికిత్సల విభాగం ఏర్పాటు చేయడం ప్రశంసనీయమన్నారు. కొన్ని సంవత్సరాలుగా డాక్టర్ జొన్నలగడ్డ వికాస్, డాక్టర్ కృష్ణ సాహితి వివిధ ఆస్పత్రులలో పనిచేసి నైపుణ్యం గడించారని, ఆ అనుభవంతో నూతన ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన, నాణ్యమైన సేవలు నంద్యాల ప్రాంత ప్రజలకు అందుబాటు వ్యయంలో అందించాలని కోరారు. డాక్టర్ జొన్నలగడ్డ వికాస్, డాక్టర్ కృష్ణ సాహితి మాట్లాడుతూ నగరాలకు దీటుగా అన్ని రకాల అత్యాధునిక పరికరాలతో నంద్యాలలో ఆసుపత్రి ఏర్పాటు చేశామని, అంకితభావంతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. నూతన ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా ఈనెల 16వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఉచితంగా ఓపిడి సేవలు అందిస్తామని నంద్యాల ప్రాంత ప్రజలు దీని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నంద్యాల వైద్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రేసులో వడ్డాది ఉదయకుమార్!

విశాఖపట్నం, మార్చి 15 (జనస్వరం) : ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ రేసులో విశాఖపట్నానికి చెందిన వడ్డాది ఉదయ కుమార్ కూడా ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట వేయడం పట్ల ఉదయకుమార్ హర్షం వ్యక్తం చేశారు. గత పది సంవత్సరాలుగా బ్రాహ్మణ అభ్యున్నతికి, బ్రాహ్మణ సంక్షేమానికి ఉదయకుమార్ వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నారు. దేశంలో కరోనా మహమ్మారి పీడించిన సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న బ్రాహ్మణుల కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేయడంలో ముఖ్యపాత్ర వహించారు. ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య విశాఖ జిల్లా అధ్యక్షులుగా ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు అర్చక, పురోహిత సంఘాలు అలాగే వివిధ ప్రైవేట్ ఉద్యోగాలు చేసే వ్యక్తులకు సంబంధించి బ్రాహ్మణ సంఘాలతో కూడా సత్సంబంధాలు తనకు ఉన్నాయని ఉదయకుమార్ పేర్కొన్నారు. బ్రాహ్మణులకు పూర్తి స్థాయిలో ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి పోటీ పడుతున్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంలో పార్టీ పెద్దలను కలిసి తన బయోడేటాను అందజేసినట్టు ఉదయకుమార్ తెలియజేశారు. తనకు బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తే రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని పథకాలు బ్రాహ్మణులకు అందేటట్లు చేస్తానని ఉదయకుమార్ తెలియజేశారు. బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ మరింత బలోపేతం చేయడానికి, బ్రాహ్మణ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీలో సభ్యత్వ నమోదు అంతే కాకుండా అర్హులైన బ్రాహ్మణ యువతీ యువకులకు వివిధ రకాల వ్యాపారాలు, వృత్తులు చేసుకునేందుకు రుణాలు మంజూరు చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానని ఉదయకుమార్ తెలియజేశారు. అదేవిధంగా ప్రైవేట్ అర్చక, పురోహితులకు బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా వారుకోరుతున్నట్లుగా గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేయడానికి కృషి చేయనున్నట్లు ఉదయకుమార్ పేర్కొన్నారు. గతంలో మాదిరిగా బ్రాహ్మణ అగ్రహారాలు ఏర్పాటుచేసి బ్రాహ్మణులందరికీ ప్రభుత్వం మంజూరు చేసే హౌసింగ్ మంజూరు చేయడానికి కృషి చేయడం జరుగుతుందని ఉదయకుమార్ తెలియజేశారు.

ఎమ్మెల్సీగా ఎన్నికైన బీద రవిచంద్రకి అభినందనలు

టీడీపీ రాష్ట్ర (ఎస్సీ సెల్) అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ



నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : ఎమ్మెల్సీగా రెండవసారి ఎన్నికైన టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను జిల్లా టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ మర్యాద పూర్వకంగా కలిసి ప్రత్యేకంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా మాతంగి కృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో బీద రవిచంద్ర భాగస్వాములై అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తారన్నారు. పార్టీ కోసం కష్టపడే వారికి పార్టీ అధిష్టానం ఎల్లవేళల అండగా ఉంటుందన్నారు. బీద రవిచంద్ర భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థిస్తున్నట్లు తెలిపారు

వెంకటేశ్వర స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, మద్రగడ గిరిబాబు



కిర్లంపూడి, మార్చి 15 (జనస్వరం) : స్థానిక గ్రామంలో వేంచేసికున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలు ఘనంగా ముగుశాయి. ఈనెల 9వ తారీకు నుండి ఆలయం వద్ద నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ సప్తమ మహోత్సవ కార్యక్రమాలు శనివారం స్వామి వారి అన్న సమారాధనతో ముగిశాయి. ఆలయ కమిటీ అధ్యక్షులు మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు సత్యవేణి దంపతులు ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఏడవ కళ్యాణ మహోత్సవ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ శ్రీ కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురఆరోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఆలయ కమిటీ సభ్యులు జ్యోతుల చంటిబాబును, ముద్రగడగిరి బాబును కండువా వేసి వారిచే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని జ్యోతుల చంటిబాబు, ముద్రగడ గిరిబాబు ప్రారంభించారు. అనంతరం మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు మాట్లాడుతూ కలియుగ దైవమైన శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవాలకు విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన కిర్లంపూడి చిల్లంగి జగపతినగరం గ్రామ పెద్దలకు భక్తులకు ఆలయ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ముస్లిం మైనారిటీ నాయకుల ఆధ్వర్యంలో ఆదాలను సన్మానం

నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : పవిత్ర రంజాన్ సందర్భంగా నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గం వైసీపీ పరిశీలకులు ఆదాల ప్రభాకర్ రెడ్డిని వైసీపీకి చెందిన పలువురు ముస్లిం మైనార్టీ నాయకులు ఘనంగా సత్కరించి ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ఆదాల క్యాంప్ కార్యాలయంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ఏసునాయుడు, రూరల్ నియోజకవర్గంలోని 12వ డివిజన్ చెందిన వైసీపీ నాయకులు షేక్ కరిముల్లా తదితరుల ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ నాయకులు మాజీ ఎంపీ ఆదాలను ఘనంగా సత్కరించారు. అదేవిధంగా నెల్లూరు విజయ డెయిరి చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డిని సత్కరించి ముందస్తు రంజాన్ పర్వదినం శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సమ్మద్, అప్జల్, బషీరా, అహ్మద్ భాషా, సుభాని, జిలాన్, మున్నా, రెహమాన్, హఫీజ్, షేక్ అల్లాబక్షు, షేక్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

లోవరాజు కుటుంబ సభ్యులకి అండగా పదో తరగతి 2002-03 పూర్వ విద్యార్థులు

- ఇటీవలే గుండెపోటుతో మరణించిన లోవరాజు
- పదో తరగతి 2002-03 బ్యాచ్ తరపున రూ.40000లు ఆర్థిక సహాయం
- భవిష్యత్తో పిల్లల చదువులకు అండగా ఉంటానని హామీ



ప్రత్తిపాడు, మార్చి 15 (జనస్వరం) : ఆపదల అంటే సొంత మనుష్యులే ఆమడ దూరంలో ఉండే ఈ రోజుల్లో మండలంలోని లంపకలోవ హై స్కూల్లో 2002-03 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు గొప్ప మనసు చాటుకున్నారు. తమతో పాటు చదువుకొని ఆడుతూ పాడుతూ తిరిగిన ప్రత్తిపాడు మండలం పెద శంకర్లపూడి గ్రామానికి చెందిన లక్కాకుల లోవరాజు (37) గుండెపోటుతో మరణించడంతో మానవతా దృక్పథంతో రూ.40000లు పూర్వ పదో తరగతి విద్యార్థులు ఆర్థిక సాయం అందించారు. ఈ సాయాన్ని లోవరాజు భార్య, కుమారులకు పెద శంకర్లపూడి వెళ్లి వాళ్ళ కుటుంబ సభ్యులను పరామర్శించి అందించారు. భవిష్యత్లో మీ కుటుంబానికి పిల్లల చదువులతో పాటు ఏ ఆర్థిక సహాయం చేయడానికైనా ముందు ఉంటామని లోవరాజు కుటుంబ సభ్యులకు అందరి తరపున ఒంపోలు సురేష్, తుమ్మల నాగేశ్వరరావు (సుబ్బు), పొన్నగంటి రామకృష్ణ పోతురాజు శ్రీను భరోసా కల్పించారు. ఒంపోలు సురేష్,యర్రల నవీన్, వానపల్లి దుర్గ, కొప్పిశెట్టి అరుణ్ కుమార్, బుర్రి మమత, శీరం శివ, నెల్లిపూడి సూర్య ప్రకాష్, దారబోయిన వీరబాబు, సూర్నీడి రాజేష్, చేదులూరి శాంతి, కొట్టేటి చక్రధర్, గంటల జగదీశ్, చింతల దేవి, పల్లి రవిశేఖర్, దలే దేవి, సిగిరెడ్డి బాబ్జి, బంగారు ప్రసాద్, బెణికం సుధారాణి, రీసు వెంకటేష్, ఒమ్మి సురేష్ ఉమ్మిడి పుల్లయ్య, నట్టే లోవబాబు, దూళ్ల ధనలక్ష్మి, దాట్ల ప్రజ్ఞ, పొన్నగంటి రామకృష్ణ, వెదుళ్ల లోవరాజు, దలే శ్రీను, రామిశెట్టి సూర్య భాస్కరమణి తదితరులు ఈ ఆర్థిక సాయాన్ని అందజేశారు.

దేవరపాలెంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

నెల్లూరు, మార్చి 15 (జనస్వరం) : రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి నెల మూడో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రూరల్ మండలంలోని దేవరపాలెం గ్రామ పంచాయతీలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీడీఓ వీ.శైలేంద్ర కుమార్, ఉప సర్పంచ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొని సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేశారు. ప్లాస్టిక్ వాడడం వలన మన ఆరోగ్యంతో పాటు పర్యావరణం కూడా అత్యంత హానికరమని తెలియజేశారు. ప్లాస్టిక్ వినియోగం క్యాన్సర్ కారకమని తెలియజేశారు. ప్లాస్టిక్ వలన కలిగే అనర్థాన్ని వివరిస్తూ ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా వస్తువులపై ప్రజలు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. గ్రామంలో ట్రాన్సిట్ వాక్ నిర్వహించి స్థానికంగా రోడ్లు మార్జిన్ లో ఉన్న టిఫిన్ షాప్స్ వారికి, తోపుడు బండ్లు వారికి, కిరాణా షాప్స్ వారికి అవగాహన కల్పించి స్వర్ణాంధ్ర సాదించుటకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి మాట్లాడుతూ తమ గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా తమ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందిస్తానని తెలిపారు. అనంతరం రూరల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర స్వచంద్రా కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థలను తొలగించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వీ.శైలేంద్ర కుమార్ మండల కార్యాలయ సిబ్బంది అందరూ పాల్గోని ప్లాస్టిక్ వ్యర్థలను తొలిగించారు.

వినాయకుని దర్శించుకున్న కంబాల చిక్కాల



పాయకరావుపేట, మార్చి 15 (జనస్వరం) : మండలంలోని మసాహెబ్ పేట గ్రామంలో వినాయకుని గుడి దగ్గర గజ స్తంభం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని వినాయకుని మాజీ ఎమ్మెల్యే, స్థానిక సమన్వయకర్త కంబాల జోగులు, జిల్లా మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పాయకరావుపేట వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామరావు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్లు గెడ్డమూరి నీలవేణి శ్రీనివాసరావు, ఎంపీటీసీ కొంతం నరేష్, గ్రామ పెద్దలు పాల్గొంటున్నారు.

కొయ్యూరులో బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కో-కన్వీనర్ కాంగ్ శుభ పర్యటన

కొయ్యూరు, మార్చి 15 (జనస్వరం) : మండల కేంద్రంలో మొట్టమొదటిసారిగా బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కో కన్వీనర్ కాంగ్ శుభ గవర్నమెంట్ హై స్కూల్, బాయ్స్ వన్, బాయ్స్ టు గర్ల్స్ హాస్టల్, కేజీబీవీ రావణపల్లి గర్ల్స్ హాస్టల్, వైన్ పాకలు పాకల్ హాస్టల్ పదవ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు రాసే 400 మంది విద్యార్థులకు, స్టేషనరీ ప్లాంక్, పెన్ను, పెన్సిల్ కాన్ఫర్ బాక్స్‌తో కూడిన కిట్లను పంపిణీ చేశారు. అనంతరం రాష్ట్ర కో కన్వీనర్ కాంగ్ శుభ గర్ల్స్ హాస్టల్లో విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు, స్కూల్లో మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. పిల్లలు కష్టపడి చదవాలని మంచి మార్కులు సాధించి ఉన్నతమైన చదువులకు వెళ్లాలన్నారు. కేజీబీవీ పాఠశాల పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు ముందుగా స్వాగతం పలికి రాష్ట్ర కన్వీనర్ శుభకు పుష్పగుచ్చాన్ని అందజేశారు. గిరిజన సంక్షేమ పాఠశాలలో చదువుతున్న గిరిజన విద్యార్థులు అందరూ అబ్దుల్ కలాం చెప్పినట్టుగా కలను సాకారం చేయాలన్నారు. కష్టపడి చదివి జీవితంలో మంచి ఉద్యోగం సంపాదించి పలువురికి ఆదర్శంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా అల్లూరు జిల్లా బాలల లీగల్ అడ్వైజర్ నడిగట్ల నూకరాజు మాట్లాడుతూ గిరిజన విద్యార్థులు మరింత ఉన్నత స్థానంలో ఉండాలని, బాలల పరిరక్షణలో ఎటువంటి సమీక్షలు ఉన్న తమకు తెలియజేయాలన్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి చెందిన ఎర్ర యుగంధకుమార్ 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు స్టేషనరీ అందజేశారని, గిరిజన ప్రాంతంలో గిరిజన విద్యార్థులకు తన వంతుగా ఏదో సహాయం చేయాలని, అదే సంకల్పంతో స్టేషనరీ అందజేశామని, విద్యార్థులకు ఏ అవసరం ఉన్న సహాయం చేయటానికి ముందు ఉంటానని యుగంధ కుమార్ తెలిపారు. ఎన్నడు లేని విధంగా బాలల హక్కుల పరిరక్షణ రాష్ట్ర కో కన్వీనర్ స్టేషనరీ అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని, విద్యార్థులు సైతం ఆనందం వ్యక్తం చేశారు.